# ప్రజాశక్తి

శనివారం 23 నవంబర్ 2024 8 పేజీలు







ప్రకాశం బాపట్ల




హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి

## 7న బాపట్లకు సిఎం రాక

### మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు హాజరుకానున్న చంద్రబాబు

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల పర్యటన ఖరారయ్యింది. డిసెంబర్ ఏడో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి తొలిసారిగా బాపట్ల జిల్లాకు రానున్నారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్'లో సిఎం చంద్రబాబునాయుడు పాల్గొంటారని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో బాపట్ల పట్టణం లోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని కలెక్టర్ వెంకటమురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ కలిసి శుక్రవారం పరిశీలించారు. హెలిప్యాడ్ కోసం పోలీస్ కవాతు మైదానం, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని క్రీడా మైదానాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలకు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖ్యమంత్రి నిర్వహించే సమావేశ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా ఉన్నతంగా ఎదిగిన పూర్వ విద్యార్థులను తప్పనిసరిగా పిలిపించి విద్యార్థులతో మాట్లాడించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా ఆహ్వానించాలని అధికారులతో చెప్పారు. పండుగ వాతావరణంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలన్నారు. ముందస్తుగా విద్యార్థుల ప్రోగ్రెస్‌పై చర్చ జరపాలన్నారు. మధ్యాహ్నం 'శుభ దిన భోజనం' నిర్వహణ మెనూ పాటించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన జయప్రదం చేయడానికి అందరూ సమన్వయంతో సహకరించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్ జైన్, డిఇఒ పురుషోత్తం, ఆర్డిఓ పి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

## ఊరూరా మద్యం

- గ్రామాల్లో భారీగా విస్తరించిన బెల్టుషాపులు
- ఎమ్మెల్యేలకూ పర్సంటేజీలు..
- వ్యాపారాలకు అండదండలు



**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**

**కూటమి ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీ పుణ్యమా.. అంటూ ఊరూరా మద్యం అందుబాటులోకి వచ్చింది. ఏమీ లేకపోయినా మద్యం మాత్రం ఎక్కడబడితే అక్కడ కొరత లేకుండా దొరుకుతుంది. తాగునీళ్లు లేవని జనం రోడ్లెక్కుతున్నారు. రోడ్లు బాగా లేవని గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగాల్లేవని యువత ఆందోళన చెందుతోంది. ఫీజు రీయింబర్సుమెంట్ ఇవ్వలేదని కాలేజీల్లో ఫీజులు కోసం విద్యార్థులను యజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఇలా అనేక సమస్యలు గ్రామాల్లో ఉన్నాయి. గ్రామాల్లో ఏ సమస్య లేకుండా మద్యం మాత్రం యథేచ్ఛగా దొరుకుతోంది. ఇదే సర్కార్ నూతన మద్యం పాలసీ వల్ల జరిగిన మేలు.!**

ఊరూరా మందుబాబులకు సౌలభ్యం వచ్చింది. ఇంకేముందీ తాగినంత తాగుతున్నారు. పనులకు పోతున్నారా? లేదా? అన్నదీ ఆందోళనగా మారింది. కుటుంబాలు గుల్లవుతున్నాయి. ఇప్పటికే మద్యం కుంపట్లు అనేక కుటుంబాల్లో చీకటి నింపుతున్నాయి. ఆదాయాలన్నీ వాటికే తగలబెడుతున్నారు. పలు చోట్ల మహిళలు మద్యం దుకాణాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. మద్యం పాలసీ వల్ల దుకాణాలన్నీ ప్రైవేటుపరమయ్యాయి. వీటిని తెలుగుదేశం నేతలే దక్కించుకున్నారు. ఎమ్మెల్యేలు దగ్గరుండి వీటిని పర్యవేక్షించి అన్ని దుకాణాలూ వారికే వచ్చేలా చూశారు. కొన్ని చోట్ల వైసిపి మద్దతుదారులకూ వచ్చాయి. ఏదేమైనా అందరూ కలిసి సిండికేట్‌గా మారారు. ఇక ఎమ్మెల్యేలకూ ఏదోరకంగా మద్యం దుకాణాల ఆదాయాల్లో వాటాలూ ఉన్నాయి. 20 నుంచి 30 శాతం ఇవ్వాలని షరతు పెట్టారు. దుకాణాల యజమానులు అనివార్యంగా అంగీకరించారు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలే తెరచాటు యజమానులుగా ఉన్నారని వినికిడి. ఇక ఎమ్మెల్యేల అండతో వ్యాపారం సాగుతోంది. జిల్లాలో 175 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేశారు. మండలానికి మూడు లేదా నాలుగు దుకాణాలు మాత్రమే ఇచ్చారు. జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. వీటికి అనుసంధానంగా గ్రామాల్లో బెల్టుషాపులు వెలిశాయి. వీధికి రెండు, మూడు షాపులు పెట్టారు. కూల్‌డ్రింక్ షాపులు, బడ్డీ కొట్లు అన్నీ బెల్టుషాపులుగా మారిపోయాయి. అనేక గ్రామాల్లో వీటి కోసం వేలం పాటలు నడిచాయి. దుకాణాలకు పెద్దమొత్తంలో డబ్బులు చెల్లించి ఏర్పాటు చేసుకున్నారు. అన్ని రకాలుగా వారికి డిపార్టుమెంట్ సపోర్టు కూడా ఉంటుంది. తనిఖీలు లేవు. ఎక్సైజ్ శాఖ, పోలీసుశాఖకూ మామూళ్లు నిర్ణయించారు. నెలనెలా వారి వాటా వారికి గుట్టుగా చేరుతోంది. వీటిని సిండికేట్ నిర్వహిస్తోంది. గతంలో నాసిరకం మద్యం విక్రయించారు. ఇప్పుడు మంచి బ్రాండ్లు అంటూ వ్యాపారానికి కొత్త ప్రచారం తెచ్చారు. నాణ్యమైన మద్యం అంటూ పేరు పెట్టారు. ఇప్పటికే కొన్నిచోట్ల మద్యం దుకాణాలకు వ్యతిరేకంగా మహిళలు ఆందోళనలు, నిరసనలకు దిగుతున్నారు. మద్యం వ్యాపారం రూ.కోట్లలో సాగుతోంది. ఏదేమైనా నూతన మద్యం పాలసీ వల్ల ఊరూరా మద్యం అయితే వచ్చేసింది.

## జిల్లా సమస్యల ఊసేదీ.?

- ప్రశ్నించే వారు లేక.. ఏకపక్షంగా అసెంబ్లీ సమావేశాలు
- ఎమ్మెల్యేల విన్నపాలతోనే ముగిసిన వైనం
- ప్రకాశం, బాపట్ల జిల్లాల అభివృద్ధికి లభించని ఆర్థిక హామీలు



**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

జిల్లాల్లో దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి నిధుల ఊసే లేకుండా 10 రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. సభలో ప్రశ్నించే వారు లేక సమావేశాలు ఏకపక్షంగా సాగాయి. ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన కొందరు శాసనసభ్యులు తమ నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు కోరుతూ సభలో విన్నపాలు చేశారు. గత ఎన్నికల్లో చేసిన హామీలను నెరవేర్చే దిశగా చేపట్టాల్సి పనుల గురించి గళం విప్పారు. కానీ ఆర్థిక అంశాలకు సంబందించిన విన్నపాల విషయంలో మంత్రుల నుంచి వారికి ఎలాంటి స్పష్టమైన హామీలు లభించిన దాఖలాలు లేవు. సుదీర్ఘకాల సమస్య అయిన వెలుగొండ ప్రాజెక్టు పూర్తికి నిధులు, గుండ్లకమ్మ ఆయకట్టు అభివృద్ధి, దొనకొండ పారిశ్రామికవాడ నిర్మాణం, కనిగిరి ప్రాంతంలో బయో ఇంధనప్లాంట్ ఏర్పాటు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కొత్తగా అద్దంకి ప్రాంతంలో ఉన్న భవనాసి చెరువు అభివృద్ధి అంశం ఈ బడ్జెట్‌లో చేర్చారు. మొత్తంగా చూస్తే కేంద్రం నిధులతో రాష్ట్రంలో, జిల్లాల్లో అమలయ్యే సంక్షేమ పథకాల గురించి తప్ప, రాష్ట్రప్రభుత్వం తరపున దేనికి కూడా అభివృద్ధి నిధుల అంశాల ఊసే ఈ సమావేశాల్లో లేకపోయింది.

కూటమి ప్రభుత్వంలో ప్రాధాన్యతా అంశంగా వ్యవసాయం రంగ సమస్యలపై దృష్టి పెట్టాల్సి ఉంది. తుపానులు, భారీ వర్షాల సమయంలో వరదలు వచ్చి పంటలు నీట మునిగి ఏటా కోట్ల రూపాయల మేర రైతులకు పంట నష్టం జరుగుతోంది. ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో ఉన్న పెద్దపెద్ద డ్రైన్లకు ఏళ్ల తరబడి మరమ్మతులు లేవు. దీంతో సదరు డ్రైన్లలో జమ్ము, గుర్రపు డెక్క పెరిగి ఎగువ నుంచి వచ్చే వరదనీరు వేగంగా దిగువకు వెళ్ళే వీలు లేక పంట పొలాలు మునిగిపోతున్నాయి. రైతులు ఏటా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. డ్రైన్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సి ఉంది. బాపట్ల జిల్లాలోని లంక గ్రామాలు డ్రైనేజీ వ్యవస్థ లేక వరదల్లో ముంపునకు గురవుతున్నాయి. వీటితో పాటు పంటకాలువలు కూడా ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో కాలువ చివరి భూములకు సాగునీరు చేరడం లేదు. ఈ సమస్య పరిష్కారం ఊసే లేదు. మార్కాపురం, బాపట్లలో చేపట్టిన మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేసి ప్రజలకు వైద్యఆరోగ్య సేవలను అందుబాటులోకి తెస్తారో, లేదో అన్న విషయమై ఎలాంటి స్పష్టత లేదు. చీరాలలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు వచ్చాయి. హార్బర్ నిర్మాణం గురించిన ప్రస్తావన లేదు. నిజాంపట్నంలో మరో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం సగంలో నిలిచిపోయింది. దిండి వద్ద ఆక్వా పార్కు నిర్మాణంకు కూడా నిధులు ఉన్నాయి. ఈ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. చీరాల చేనేత పార్కు దశాబ్దం కాలం క్రితమే మంజూరైంది. సిఎం చంద్రబాబు హామీల్లో ▶ 2లో



స్మార్ట్‌మీటర్లను అడ్డుకున్న సిపిఎం నేతలు

## స్మార్ట్‌మీటర్లు బిగించడం అన్యాయం

### అడ్డుకున్న సిపిఎం నేతలు

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

విద్యుత్ సంస్కరణలలో భాగంగా వ్యాపార సముదాయాలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమని సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలు నాగేంద్ర నగర్ లోని అద్దాలు తయారు చేసే చిన్న పరిశ్రమకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్‌ను సిపిఎం నగర కమిటీ నాయకులు అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కో స్మార్ట్ మీటర్ రూ.13 వేలకు కొనుగోలు చేస్తుందని, ఇప్పుడు వేస్తున్న ట్రూ అప్ చార్జీల లాగే స్మార్ట్ మీటర్ల ▶ 2లో



కలెక్టర్ తమీమ్ అన్సారియా

## వెట్టిచాకిరీపై దృష్టి సారించండి

- బాధ్యులపై చట్టపరమైన చర్యలు
- అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా

# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**ప్రజాశక్తి- కనిగిరి**

మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో పొగాకు పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శిక్షణ మరియు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కనిగిరి సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇవి.రమణ, కనిగిరి ఎఒ పి. జ్యోత్స్న దేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కనిగిరి సబ్ డివిజన్ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమణ మాట్లాడుతూ పొగాకుకు మద్దతు ధర ఆశాజనకంగా ఉన్నందున ఎక్కువమంది రైతులు పొగాకు సాగుకే ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. ఒకే పంట సాగు చేయడం వల్ల భూమిలో పోషకాల లభ్యత తగ్గుతుందన్నారు. ఈ నేపథ్యంలో పంట మార్పిడి చేయాలన్నారు. పొగాకు పంటకు బదులుగా నువ్వులు, జొన్న పంట సాగు చేయాలన్నారు. తద్వారా పొగాకులో మల్లె సమస్యను కొంత వరకు నివారించవచ్చునని తెలిపారు.పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన శనగ, మినుము, పెసర, బొబ్బర, నువ్వులు, కొర్రలు సాగు చేసుకోవాలన్నారు. ఎఒ




మాట్లాడుతున్న ఎఒ

జ్యోత్స్న దేవి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది ఎం.యోగేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

## జిల్లా సమస్యల ఊసేదీ.?

(మొదటిపేజీ తరువాయి)

ఇది ఉంది. రైతులు, చేనేతలు, మత్స్యకారులు, ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన పలు అంశాల్లో రాష్ట్రప్రభుత్వం ఎలా ముందుకు వెళుతుంది అన్న విషయమై ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఎలాంటి హామీలు వచ్చిన దాఖలాలు కనిపించలేదు. బాపట్ల జిల్లా కేంద్రంలో సమీకృత ప్రభుత్వ భవనాల నిర్మాణాల గురించి కూడా ఎలాంటి ప్రస్తావన లేదు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో విశాలమైన సముద్రతీరం ఉంది. రిసార్టులు, స్టార్ హోటళ్లు వస్తున్నాయి. రానున్న కాలంలో పర్యాటక పరంగా ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు వెచ్చిస్తే మరింతగా ఆదాయం సమకూరుతుంది. ఈ దిశగా కూడా ఎలాంటి నిధుల ప్రస్తావన లేకపోయింది. సభలో ప్రతిపక్షం కూడా లేకపోవడంతో ఎమ్మెల్యేల విన్నపాలతోనే అసెంబ్లీ సమావేశాలు ముగిశాయి. ప్రకాశం, బాపట్ల జిల్లాల ఆర్థికాభివృద్ధికి ఎలాంటి హామీలూ లభించలేదు.

అన్ని రోగాలకు ఒకే మందు అన్నట్లుగా గత ఐదేళ్ల వైసిపి పాలన కారణంగా రాష్ట్రంలో అన్ని రంగాలూ అస్తవ్యస్తమయ్యాయని సభలో పదే పదే చెబుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ గాడిలో పడుతున్నాయని, 2047 నవ్యాంధ్ర విజన్ డాక్యుమెంట్‌తో రాష్ట్రం అభివద్ధి దిశగా వెళుతుందని అందరూ అప్పటివరకు వేచి చూడాలన్నట్లు చెప్పి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ముగించడం గమనార్హం.

## స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

ఖరీదు భారాన్ని వినియోగదారుల నుండి వసూలు చేస్తుందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న స్లాబ్ విధానం రద్దు అవుతుందని, ప్రీపెయిడ్ విధానంలోకి మారుతుందన్నారు. దీంతో ముందుగానే డబ్బులు కట్టి రీఛార్జి చేసుకోవాలని రీఛార్జి అయిపోయిన వెంటనే విద్యుత్ ఆగిపోతుందన్నారు. విద్యుత్ వాడే విధానాన్ని బట్టి అదనపు చార్జీలను వసూలు వేసే విధంగా టెక్నాలజీతో మీటర్ ఉందన్నారు. తద్వారా పేదలు, మధ్యతరగతి, వ్యాపార వాణిజ్య సంస్థలు అన్ని తరగతుల ప్రజలు నష్టపోతారని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 18 వేల కోట్ల రూపాయల ట్రూ అప్ చార్జీల భారం ప్రజలపై వేసిందన్నారు. నేడు స్మార్ట్‌మీటర్ల భారాన్ని కూడా వినియోగదారులపై వేస్తుందని, ప్రజలందరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు. ప్రభుత్వం కూడా స్పందించి స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు జి.రమేష్, తంబి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు టి, మహేష్, సయ్యద్ హుస్సేన్, నగర నాయకులు టి. భక్తసింగ్ రాజు, రాంబాబు, పాపని సుబ్బారావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

**ప్రజాశక్తి-కొండపి**

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహశీల్దార్ మురళి తెలిపారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దారు కార్యాలయం వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ డేవిడ్ ,ఎంఇఒ సురేఖ ,రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులతో సమావేశం

**ప్రజాశక్తి-కొత్తపట్నం :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల గైర్హాజరు శాతాన్ని తగ్గించాలని డిఇఒ కిరణ్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని అల్లూరు, కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కొత్తపట్నం హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఉపాధ్యాయులతో హెచ్ఎం ప్రతి శుక్రవారమూ సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. రెమిడీయల్ టీచింగ్ పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు తులసి కుమారి, పద్మావతి అల్లూరు, కొత్తపట్నం ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మైథిలి, ఎం. శ్రీదేవి, స్టాఫ్ సెక్రటరీ హరిబాబు,స్కూల్ అసిస్టెంట్ సాయి కిషోర్ పాల్గొన్నారు.

## విద్యార్థినులకు అభినందనలు

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

జిల్లాస్థాయిలో నిర్వహించిన జిల్లా స్థాయి బంగారు బాల్యం పోటీల్లో మండల పరిధిలోని అమ్మనబ్రోలు బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సతాచాటారు. పదో తరగతి విద్యార్థిని డి, స్నేహలత లోగో, డ్రాయింగ్ పోటీల్లో ప్రథమ బహుమతిని సాధించారు. లిఖిత వక్తృత్వ పోటీల్లో రెండో స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్‌పి దామోదర్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయులు అభినందించారు.

## పోలీసుస్టేషన్‌లో వైసిపి నేతల ఫిర్యాదు

**ప్రజాశక్తి-మద్దిపాడు**

మాజీ సిఎం వైఎస్. జగన్మోహన్ రెడ్డిని అసభ్య పదజాలంతో దూషిస్తూ, ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్న ఐటిడిపి సోషల్ మీడియాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసిపి మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి కోరారు. ఈ మేరకు మద్దిపాడు ఎస్ఐ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో వైస్‌ఎంపిపి పైడిపాటి వెంకట్రావు, ఘడియాపుడి సర్పంచి రామాంజనేయులు, దుడ్డు వినోద్, అశోక్ రెడ్డి, అన్వేష్, జి.రవి, మహేష్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థినికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-చీమకుర్తి**

స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన బత్తుల నిత్యశ్రీ నీట్‌లో ర్యాంకు సాధించి మెడిసిన్ సీటును అర్హత సాధించింది. ఈ సందర్భంగా నిత్యశ్రీ చదువు నిమిత్తం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో రు.61,400 ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆడిటర్ పారాబత్తిన గురవయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు బండ్ల డేవిడ్, ఉద్యోగులు ఎద్దు విజయ్ కుమార్, ఉపాధ్యాయుడు దాసరి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి

**ప్రజాశక్తి -కనిగిరి**

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పార్వతి తెలిపారు. మండల పరిధిలోని టమటంవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువాజిపేట, వగ్గంపల్లి సెక్టర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఫేస్ యాప్ పడిన వారికి మాత్రమే టేక్ హోమ్ రేషన్ ఇవ్వాలని సూచించారు. పోషక పదార్థాలు వచ్చిన వెంటనే యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## పంటల సాగుపై అవగాహన

**ప్రజాశక్తి-టంగుటూరు :** మండల పరిధిలోని వావిలేటిపాడు గ్రామంలో పొగాకు నారు మడుల్లో యాజమాన్యం, పొగ నాట్లు, ఎరువుల యాజమాన్యం, అంతర సేద్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలు, నీటి యజమాన్యంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. టంగుటూరు పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు తొలుత దుక్కులు దున్ని సిఫారస్ చేసిన ఎరువులు వినియోగించాలన్నారు. వర్షాలు పడిన వెంటనే పొగ మొక్కలు నాటాలన్నారు. ఆరోగ్యకరమైన నారును ఎంపిక చేసుకోవాలన్నారు. ట్రేలల్లో పెంచిన నారును వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చుని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర అధికారి జి.ఉప్పేంద్ర, ఐటిసి కంపినీ ప్రతినిధి పి. రాజశేఖర్, క్రాప్ డెవలప్‌మెంట్‌మేనేజర్లు యు. శ్రీనివాసరావు, రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

## నూతన దంపతులకు ఆశీర్వాదం

**ప్రజాశక్తి-కొనకనమిట్ల**

మండల పరిధిలోని కాట్రగుంట గ్రామంలో కొనకనమిట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఎస్‌సి. బాలయ్య తమ్ముడి కుమారుడు శిగినం శివరామకష్ణ, ఆథిరల వివాహ రిసెప్షన్ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పొదిలి మాజీ ఎంపిపిలు కోవెలకుంట నరసింహారావు, వెలిశెట్టి విజయ గౌరీ, కాపు సంఘం నాయకులు శ్రావణి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసిలు కె.నాశరయ్య , చిన్న కోటేశ్వరావు, మాజీ సర్పంచి కె. పెద్దన్న, దర్శి, నరసరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీ నాయక్, రవికుమార్, గొట్లగట్టు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పథ్వీరాజ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తప్పిన ప్రమాదం

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలో నరసింహశెట్టి ఆడితి బజారులో శుక్రవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నిత్యం రద్దీగా ఈ వీధిలో సరుకులు దింపేందుకు వచ్చిన లారీ అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొంది. ఈ విషయాన్ని గమనించి స్థానికులు అప్రమత్తం అయ్యారు. వెంటనే విద్యుత్ కార్యాలానికి ఫోన్ ద్వారా సమాచారాన్ని అందించారు. దీంతో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. అనంతరం విద్యుత్ ఎఇ .సాంబ శివరావు ఘటనా స్థలాన్ని పరి శీలించారు. విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని ఎఇ తెలిపారు.

ప్రజాశక్తి
శనివారం 23 నవంబరు 2024



# వాగులను తలపిస్తున్న రోడ్లు

**రహదారులపై నిలిచిన వర్షపు నీరు**

**గుంతల్లో ఇరుక్కుపోతున్న వాహనాలు**

**దుర్వాసనతో గ్రామస్థుల అవస్థలు**

**ప్రజాశక్తి- రాచర్ల**

రాచర్ల మండలంలోని జెల్లివారి పుల్లలచెరువు గ్రామంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులపై వర్షపునీరు నిలిచి వాగులను తలపిస్తున్నాయి. ఈ రోడ్లపై వాహనాలు ఇరుక్కుని పలువురు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. గ్రామంలో తాగునీటికి నీరు లేదు కానీ రోడ్లపై నీరు మాత్రం నెలల తరబడి నిల్వ ఉండి మురికి వాడలను తలపిస్తున్నాయని గ్రామస్థులు వాపోతు న్నారు. గత వారంరోజుల క్రితం కురిసిన వర్షానికి గ్రామంలోని అంతర్గత రోడ్లన్నీ వర్షం నీరుతో బురద గుంతలుగా మారాయి. గ్రామంలోని పశువులన్నీ ఒక్క సారిగా పొలాల్లోకి మేతకు వెళ్ళేటపుడు, తిరిగి ఇళ్లకు వచ్చేటపుడు పశువులు వేసే పేడ, మూత్రంతో నిండి మురికి కూపాలుగా మారాయి. అక్కడి నుంచి వచ్చే దు ర్వాసనతో ముక్కులు చిట్లిపోతున్నాయని, ఇళ్ళ ముందు పాచి ఏర్పడుతున్నదని



రోడ్డుపై నిలిచిన నీరు



గుంతలో ఇరుక్కుపోయిన వాహనం

గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కూపాలవలన తయారవుతున్న దోమలు ప్రజలపై యుద్ధం చేస్తున్నాయని, దీంతో గ్రామస్థులు అనారోగ్యాలకు గురవుతున్నారు. గ్రామం లోని ప్రధాన రహదారి మురికి బురద గుంటలో ఆటో ట్రక్కు చిక్కుకుపోయి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. స్థానికులు నానా అవస్థలు పడి ఆ ట్రక్కును బయటికి నెట్టారు. గ్రామంలో ప్రజలు ఇన్ని సమస్యలు ఎదుర్కొంటుంటే పాలకులు, అధికారులకు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తు న్నారు. గ్రామ సచివాలయాలు కేవలం సేవా కేంద్రా లుగా మాత్రమే పని చేస్తున్నాయని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**ప్రజాశక్తి - రాచర్ల**

రాచర్ల మండలం అనుమలవీడు, సత్యవోలు గ్రామాల్లో శుక్రవారం మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రఫిక్ ఆధ్వర్యంలో పొగాకుకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో షేక్ అబ్దుల్ రఫీక్ మాట్లాడుతూ రైతులు పొగాకు బదులు శనగ, కంది, మినుము లాంటి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చని తెలిపారు. అలాగే పొగాకు ఉత్పత్తుల వలన ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. రైతులు పొగాకు సాగు విస్తీర్ణం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు కె.నందిని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు

**ప్రజాశక్తి-కంభం రూరల్**

రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇబ్రహీం తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని కంభం మండల మహిళా సమాఖ్య సంఘం అధ్యక్షురాలు పెద్దిరెడ్డి శ్రీలక్ష్మి, కార్యదర్శి దొంతా కాశీరత్నంలు ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వెలుగు కార్యాలయంలో అవినీతి చేస్తున్నారని గ్రామ, మండల మహిళా సమాఖ్య ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఇబ్రహీం, మరి కొంతమంది అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. దళిత మహిళలను అధ్యక్షురాళ్లుగా ఎన్నుకోవడం వల్ల తన భార్య పదవి పోయిందనే అక్కసుతో దళిత మహిళలను అధ్యక్షులుగా చేసేది ఏమిటని నీచంగా, కుల వివక్షతో మాట్లాడుతున్నారన్నారు. మాల, మాదిగల పెత్తనం ఏంటి అని కుల దురహంకారంతో మాట్లాడుతూ, అధికారులకు మాపై లేని పోని ఆరోపణలతో ఫిర్యాదులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత మహిళలను అధ్యక్షులుగా తీసేసి తిరిగి జరీనాను ఎన్నుకుంటే ఫిర్యాదులు అన్నీ వెనక్కి తీసుకుంటామని లేదంటే అందరి ఉద్యోగాలు ఊడగొట్టిస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. దళిత మహిళలు అధ్యక్షురాలు కావడం ఓర్వలేక తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వారు ఎస్ఐని కోరారు. దళిత మహిళలకు, పేద మైనారిటీ, ఎస్టీ, బీసీ మహిళలకు జరుగుతున్న అన్యాయంపై ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకులు, ప్రజలు, మీడియా అండగా నిలబడాలని వారు కోరారు.

# బెల్టు షాపులు నిర్వహిస్తే జైలుకే..!

**ఎస్ఐ నాగమల్లీశ్వరరావు**

**పలుచోట్ల మద్యం బాటిళ్లు స్వాధీనం**

**ప్రజాశక్తి-టంగుటూరు**

గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే జైలుకు పోవడం ఖాయమని టంగుటూరు ఎస్ఐ వి.నాగ మల్లీశ్వరరావు అన్నారు. శుక్రవారం అనంతవరం గ్రామంలో అక్రమ మద్యం అమ్ముతున్న కటుకూరి కోటేశ్వరరావును అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే జయవరం గ్రామంలో చుండి జయరావు నుంచి ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశారు. టంగుటూరు మండలంలో బెల్ట్ షాపులలో మద్యం అమ్మితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారి సమాచారం తెలపాలని ఎస్సై ప్రజలను కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

**మార్కాపురం రూరల్:** అక్రమంగా పెద్ద ఎత్తున మద్యం నిల్వ ఉంచుకుని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మార్కాపురం గ్రామీణ ఎస్ఐ అంకమ్మరావు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని బిరుదులనరవ గ్రామానికి చెందిన విప్పర్ల రాజశేఖర్ తన ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచుకొని విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో రాజశేఖర్ ఇంటిలో పోలీసులు తనిఖీ చేసి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ అంకమ్మరావు మాట్లాడుతూ గ్రామాల్లో




మార్కాపురంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అనధికారికంగా మద్యం విక్రయిస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరచడం జరుగుతుందన్నారు. మద్యం విక్రయిస్తున్నట్లు స్థానికులకు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచి అసాంఘిక కార్యకలాపాలకు పాడపడుతున్న వారి ఆట కట్టించటం జరుగుతుందన్నారు. మండల ప్రజలు పోలీసులకు సహకరించాల్సిందిగా ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

**మద్దిపాడు:** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శివరామయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లపల్లి గ్రామంలో ఓ వ్యక్తి మద్యం అమ్ముతున్నాడనే సమాచారం మేరకు దాడి చేసి అతని వద్ద నుంచి ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**తాళ్ళూరు:** మండలంలోని తురకపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న దాసిరెడ్డి సుబ్బారెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 8 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

**పుల్లలచెరువు:** పుల్లలచెరువులో శుక్రవారం పలు షాపులను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంపత్ కుమార మాట్లాడుతూ మండల పరిధిలో మద్యం బెల్ట్ షాపులు నిర్వహించరాదన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న పలువురిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేశారు. పుల్లలచెరువు తహశీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.



పుల్లలచెరువులోని చిల్లర దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

## నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు

**300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం**

**ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్**

గిద్దలూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.జయరావు అధ్వర్యంలో శుక్రవారం గిద్దలూరు మండలం కొత్తకోట గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. మేదర చెరువు వద్ద నాటు సారా తయారు చేస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రెండు లీటర్ల నాటు సారా, సారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ జయరావు తెలిపారు. నాటు సారా తయారీ, అమ్మకం, కలిగి ఉండడం, రవాణా చేయడం, చట్టరీత్యా నేరంమని, వీటితో సంబంధం ఉన్న వ్యక్తుల సమాచారం తమకు తెలపాలని సిఐ జయరావు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు నరహరి రావు, రామారావు, మార్కాపురం ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ బాక్సుల దొంగలు అరెస్టు

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

సెంట్రింగ్ బాక్సులు దొంగతనం కేసులో ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ బి.మహేంద్ర తెలిపారు. శింగరాయకొండకు చెందిన జంగాలపల్లి వంశీ, కందుకూరుకు చెందిన చిన్నకత్తుల శ్రీను, శింగరాయకొండకు చెందిన పెద్దకొత్తుల హరిబాబులు పలు చోట్ల సెంట్రింగ్ బాక్సులు దొంగతనం చేసి అమ్ముకున్నారు. ముగ్గురు నిందితులను కనిగిరి కోర్టు హాజరు పరచగా జడ్జి 15 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

## బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

**ప్రజాశక్తి-టంగుటూరు**

జరుగుమల్లి మండలానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిని ఒంగోలు స్పెషల్ బ్రాంచి డీఎస్పీ సురేష్ బాబు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి బాలిక కనపడకపోవడంతో 11వ తేదీన బాలిక తల్లి జరుగుమల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టి బాలికకు మాయమాటలు చెప్పి వంచించిన ముద్దాయి సుంకర రామస్వామిని ఈ నెల 15వ తేదీన అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు జరుగుమల్లి పోలీసులు తెలిపారు.

## జూదరులు అరెస్టు

**ప్రజాశక్తి-పొన్నలూరు**

పొన్నలూరు మండలంలోని బాలిరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ అనూక్ శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పారిశుద్ధ్య కార్మికురాలిని కొనసాగించాలి

**ప్రజాశక్తి-రాచర్ల**

రాచర్ల మండలం పాలకవీడు గ్రామం ఎంపీపీ స్కూల్‌లో స్కూల్ శానిటైజర్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న దమ్ము భారతిని స్కూల్ హెచ్ఎం రమణారెడ్డి అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించడం అన్యాయమని, తిరిగి ఆమెను కొనసాగించాలని సిఐటియు రాచర్ల మండల ప్రధాన కార్యదర్శి డి.తామస్ అన్నారు. నిరసనగా 25వ తేదీ రాచర్ల ఎంఈవో కార్యాలయం ఎదుట బాధిత కార్మికురాలు భారతి కుటుంబ సభ్యులతో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

# ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకే 'సనాతన ధర్మం'

## సిపిఎం మహాసభల్లో రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య

**ప్రజాశక్తి - ముండ్లమూరు**

సిపిఎం మండల 4వ మహాసభ వేంపాడులో ఘనంగా ప్రారంభమైంది. పంట ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన మహాసభల్లో సిపిఎం రాష్ట్ర నాయకులు జాల అంజయ్య మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు బిజెపికి తగిన మెజార్టీ ఇవ్వలేదని, ఎన్డీఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వ ఏర్పడినప్పటికీ గత ఆర్థిక విధానాల్నే దూకుడుగా అమలు చేస్తుందని అన్నారు. కార్పొరేట్ల కోసం జెమిలి ఎన్నికలు అంటూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అన్నారు. ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు సనాతన ధర్మం పేరుతో హిందుత్వ ఎజెండాను ప్రజలపై రుద్దుతుందని అన్నారు. పౌర హక్కులు, ప్రజా ఉద్యమాలను కాలరాసేందుకు చట్టాన్ని తెచ్చిందని అన్నారు. రాజ్యాంగ సంస్థలను అడ్డం పెట్టుకొని ప్రాంతీయ పార్టీలను బెదిరిస్తూ రాష్ట్రాల హక్కులు హరిస్తుందని ఆరోపించారు. వైపినిని ఓడించి పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం కూటమి ఇచ్చిన హామీల అమలకు పూనుకోవాలని కోరారు. కేంద్రంలో బిజెపికి వైసిపి, టిడిపి సాయంచేస్తూ రాష్ట్రంలో బద్ధశత్రువులుగా నాటకం ఆడుతున్నారని అన్నారు. ఈ మండలంలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. సాగర్ చివరి భూములకు నీరు అందించాలని కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. పంటల భీమా వర్తింపజేయాలని కోరారు. విద్యుత్ లో వోల్టేజీ సమస్య పరిష్కారం కోసం సిపిఎం కృషి చేసిందని అన్నారు. సభలో సిపిఎం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, తోట తిరుపతిరావు, బొమ్మతోటి రఘురాం, వెల్లంపల్లి ఆంజనేయులు, బోడపాటి హనుమంతరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య

## బాపట్ల, చీరాల నియోజకవర్గాల అభివృద్ధి కోసం

# అసెంబ్లీలో గళం వినిపించిన ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య

**ప్రజాశక్తి - బాపట్ల జిల్లా**

మొదటి సారిగా బాపట్ల, చీరాల నియోజకవర్గాల నుంచి శాసన సభ్యులుగా ఎన్నికైన వేగేశన నరేంద్రవర్మ రాజు, మద్దులూరి మాలకొండయ్య తమ నియోజకవర్గాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ సమావేశాల్లో తమ గళం వినిపించారు. జిల్లాలోని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ 5పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. జిల్లా నుంచి మంత్రిగా ఉన్నారు. రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ 3సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ఉన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు 3 సార్లు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు మాత్రమే తొలిసారి ప్రజాప్రతినిధులుగా శాసనసభలో అడుగు పెట్టారు. ఎమ్మెలుగా ఎన్నికైన అనంతరం తమ నియోజకవర్గాల్లో పర్యటనలు జరిపి స్థానికంగా ప్రజా సమస్యలను గుర్తించడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి కి తీసుకోవాల్సిన చర్యలను ఆకళింపు చేసుకున్నారు. 10 రోజుల పాటు జరిగి శుక్రవారంతో ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో పలు అంశాలను ప్రస్తావించారు. బాపట్ల జిల్లాగా ఆవిర్భవించినప్పటి నుంచి బాపట్ల, చీరాల పట్టణాలను జంట నగరాలుగా అభివృద్ధి చేయడం ద్వారా జిల్లా పురోభివృద్ధి చెందుతుందన్న ప్రచారం గత ప్రభుత్వ హయాంలో విస్తృతంగా జరిగింది. కాని ఆ మేరకు ఎలాంటి ప్రణాళికలు రూపకల్పన జరగలేదు. బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు రెండు పట్టణాల అభివృద్ధికి సమిష్టి కృషి చేయాల్సిఉంది. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అసెంబ్లీలో పలు అంశాలను సభలో ప్రస్తావిం చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు చీరాలలో చేనేత పార్కు ఏర్పాటుకు త్వరితంగా శ్రీకారం చుట్టాలని కోరారు. చీరాల ప్రాంతంలో చేనేతలు అత్యధికంగా ఉన్న క్రమంలో 2014-19 టిడిపి ప్రభుత్వ కాలంలో అమలు చేసిన అన్ని పథకాలను వారికి అందించే కృషి చేయాలన్నారు. చీరాల ఏరియా వైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయ న్నారు. ఇక్కడ డయాలసిస్ యూనిట్ ఉందని, ట్రామా కేర్ సెంటర్ మంజూరైందని, భవనాల మరమ్మత్తులకు నిధులు కేటాయించాలన్నారు. ఎత్తిపోతల పథకాలన్నీ నిరుప యోగం అయ్యే పరిస్థితి ఉన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు నిధుల విడుదలతో పాటు ఇంజనీరింగ్ అధికారుల నియామకాలు జరపాలన్నారు. వ్యవసాయ రంగానికి చెందిన శాఖలను మిళితం చేయడం ద్వారా రైతులను ఆదుకోవాలన్నారు. దీనితోపాటు ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి చీరాలలో ఉన్న డ్రైనేజీ డివిజన్ పరిపాలన శాఖ నూతన భవనం కోసం, ఇరిగేషన్ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేశారు


బాపట్ల, చీరాల ఎమ్మెల్యేలు నరేంద్రవర్మ, కొండయ్య

**పర్యాటక అభివృద్ధికి నిధులు కోరిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన**

జిల్లా కేంద్రంగా ఉన్న బాపట్ల రానున్న కాలంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని, ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేసన నరేంద్రవర్మరాజు అసెంబ్లీలో తన గళం వినిపించారు. ప్రధానంగా బాపట్ల, చీరాల ప్రాంతాల్లో రహదార్లను అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటక పరంగా వేగంగా అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. సముద్ర తీరంలో ఇప్పటికే ఉన్న రిసార్టులతో పాటు స్టార్ హోటళ్ళ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వాడరేవు-పిడుగురాళ్ళ రహదారి నాలుగులైన్లుగా విస్తరణ జరుగుందని, బాపట్ల, చీరాల మధ్య 15కిలోమీటర్లుగా ఉన్న రామదండు రోడ్డును అభివృద్ధి చేసేందుకు నిధులు కోరారు. ఈ రహదార్ల అభివృద్ధి ద్వారా బాపట్ల, చీరాలకు హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి 5 గంటలలోపు చేరే వీలుంటుందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిధులివ్వాలని కోరారు.

# యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక


వై శ్రీనివాసరావు ఎండి హుస్సేన్ సిహెచ్ గణేష్‌రావు

**ప్రజాశక్తి - నిజాంపట్నం**

ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడుతుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బాపయ్య అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన స్వర్ణోత్సవ మహాసభలో వారు మాట్లాడారు. అప్రెంటిస్ రద్దు, రీ గ్రూప్ స్కేల్ సాధించడంలో యుటిఎఫ్ చేసిన కృషిని కొనియాడారు. మండల నూతన కమిటీ ఎన్నికల అధికారిగా సిహెచ్ బాపయ్య, పరిశీలకులుగా జె వినయ్ కుమార్ వ్యవహరించారు. నూతన అధ్యక్షులుగా వై శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎండి హుస్సేన్, గౌరవాధ్యక్షులుగా సిహెచ్ గణేష్‌రావు, సహాధ్యక్షులుగా ఓ నాగరాజు, సహాధ్యక్షురాలుగా ఎన్ సుధారాణి, కోశాధికారిగా యు కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని జిల్లా కౌన్సిలర్ డి హరిబాబు, మాలిక్, కె రాజేష్, మార్క్, ఓ మహేశ్వరరావు, సాంబయ్య, సుబ్బారావు, ఆంజనేయులు, సుభాని ఖాన్ అభినందించారు.

**మేదరమెట్ల :** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ మహాసభ స్థానిక యుటిఎఫ్ భవన్లో నిర్వహించారు. యుటిఎఫ్ మండల అధ్యక్షునిగా టి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల పోతురాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ సమస్యలపై తీర్మానాలు చేశారు. సంఘం సభ్యత్వాన్ని పెంచుకోవాలని, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు వచ్చేన సమస్యలపై స్పందించాలని తీర్మానించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి హరిబాబు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహ రించారు. జిల్లా ఆడిట్ కమిటీ స భ్యులు బాబు రావు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మేదరమెట్ల అధ్యక్ష, కార్యదర్శులు

**ఇంకొల్లు :** యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. తొలుత యుటిఎఫ్ వ్యవస్థాపకులు దాచురి రామిరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యు చెంచయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించగా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యుటిఎఫ్ గౌరవాధ్యక్షురాలు ఎన్ సమతాను, అధ్యక్షులు పి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వి శ్రీమన్నారాయణ, జై అనిత, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె మస్తాన్‌వలి, కోశాధికారి ఎం మాధవ, జిల్లా కమిటీ సభ్యులు వివి సుబ్బారావు, శివరామకృష్ణ ప్రసాద్ ఎన్నికయ్యారు.


యుటిఎఫ్ ఇంకొల్లు మండల నూతన కార్యవర్గం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

# విశ్రాంత ఉపాధ్యాయుల వితరణ

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు, విశ్రాంత ఉపాధ్యా యులు కొడాలి లక్ష్మీకాంతారావు, కూచిమంచి శివరామకృష్ణ ను సన్మానించారు. యుటిఎఫ్ కార్యాలయానికి రూ.6వేల విలువచేసే డబల్ డెస్క్ టేబుల్‌ను లక్ష్మీకాంతారావు బహు కరించారు. గత సెప్టెంబర్ 30న వెల్లటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పదవీ విరమణ చేసిన కూచిమంచి శివరామకృష్ణ కంప్యూటర్ కొనుగోలు నిమిత్తం మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.5వేలు సమకూర్చారు. ఈనెల 24న సూర్య కాశీ ఫంక్షన్ ప్లాజా నందు జరగనున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేయాలని కోరారు. యుటిఎఫ్ సీనియర్ కార్యకర్త ఎంఎ అయూబ్ మాట్లాడు తూ విద్యా రంగంలో, యుటిఎఫ్ కార్యవర్గంలో కాంతా రావు, శివరామకృష్ణ చేసిన సేవలు ప్రశంసించారు.



అవార్డు అందుకుంటున్న విక్రమనారాయణ

# విక్రమ్ నారాయణకు అవార్డు

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

చిన్నగంజాం మండలం గొనసపూడికి చెందిన యువ పారిశ్రామికవేత్త విక్రమ్ నారాయణరావుకు ది ఎమర్జింగ్ హెల్త్ సూటికల్ ఆఫ్ ది ఇయర్ అరుదైన అంతర్జాతీయ అవార్డు లభించింది. తాను స్థాపించిన ఔషధ తయారీ సంస్థ లాయిడ్ హెల్త్ కేర్ ప్రైవేట్ కంపెనీ ద్వారా ప్రజల ఆరోగ్య సంరక్షణ కనబరిచిన ప్రపంచ ఆరోగ్య రంగంలో గణనీయమైన మార్పు చూపినందుకు అంతర్జాతీయంగా అవార్డు లభించింది. అవార్డును బ్రిటిష్ పార్లమెంట్ లండన్ వేదికగా ఇంటర్నేషనల్ బుక్ హానర్ ఇంగ్లాండ్ ప్రకటించినట్లు లాయిడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, అవార్డు గ్రహీత నారాయణరావు శుక్రవారం ప్రజాశక్తికి తెలిపారు. ముంబాయి కేంద్రంగా లాయిడ్ హెల్త్ కేర్ ఫార్మ సూటికల్ కంపెనీ పనిచేస్తున్నట్లు తెలిపారు.


ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

# ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి - వేటపాలెం**

ఇంటర్ యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు సెయింట్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థినిలు అర్హత సాధించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. కాకినాడ జెఎన్‌టియు తరపున ఇంటర్ యూనివర్సిటి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు ఇన్చార్జి ప్రిన్సిపాల్ సిహెచ్ హరి కిషన్ తెలిపారు. బి టెక్ చదువుతున్న విద్యార్థినులు వి జయవేద, సిహెచ్ జ్యోత్స్న గాయత్రి, ఎంబిఎ మొదటి సంవత్సరం చదువుతున్న డి లావణ్య గుంటూరు జిల్లా నాగార్జున నగర్‌లో ఈనెల 26 నుండి 28 వరకు జరగనున్న సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటి వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్లో పాల్గొంటున్నట్లు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. వీరికి శనివారం నుండి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



ఈవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న డిఆర్ఓ

# ఈవిఎం గోడౌన్ పరిశీలన

## - భద్రతా ఏర్పాట్లపై డిఆర్ఓ సంతృప్తి

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు (ఇవిఎం) గోదాములను జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను పరిశీలించి సంబంధిత రిజిస్టర్ లో సంతకం చేశారు. అక్కడి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈవిఎం గోడౌన్‌లో భద్రత ఏర్పాట్లపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటిండెంట్ రాజ్యలక్ష్మి, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో వర్కర్స్ యూనియన్ బోర్డు ఆవిష్కరణ

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**



బోర్డు ఆవిష్కరణ కార్యక్రమంలో ఎస్ఐ చౌడయ్య

పట్టణంలోని కొలుకుల సెంటర్‌లో సిఐటియు అనుబంధ ది కొలుకుల రూట్ ఆటో వర్కర్స్ యూనియన్ బోర్డును యర్రగొండపాలెం ఎస్సై పి. చౌడయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ శుక్రవారం ఆవిష్కరించారు. సిఐటియు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎస్సై పి చౌడయ్య మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలతో ఆటోలు నడుపుకోవాలని తెలిపారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం, లైసెన్సులు ఖచ్చితంగా కలిగి ఉండాలన్నారు. ఓవర్ లోడ్‌తో ప్రయాణాలు చేయవద్దని చెప్పారు. మద్యం సేవించి ఆటోలు నడపరాదన్నారు. లైసెన్సు లేని ఆటో డ్రైవర్లకు లైసెన్సులు పొందేందుకు సహకరిస్తానని తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం.రఫీ మాట్లాడుతూ ఆటో కార్మికుల జీవితాలకు భద్రత లేదని చెప్పారు. ప్రమాదాల జరిగితే కుటుంబాలు వీధి పాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆటో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు టంగుటూరి సత్యనారాయణ, భూమని వెంకటేశం, పుల్లలచెరువు మండల కార్యదర్శి బొజ్జ వెంకటేశ్వర్లు, ఆటో యూనియన్ నాయకులు రామాంజనేయులు, బుజ్జి, మౌలాలి, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గూడేల్లో సౌకర్యాల కల్పనకు గ్రామసభ

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

మండలంలోని చింతల, తుమ్మలబైలు చెంచుగూడేల నందు సర్పంచ్ భూమని వెంకటయ్య అధ్యక్షతన జిల్లా గిరిజన సంక్షేమాధికారి జగన్నాథరావు ఆదేశాలతో ఐటిడిఏ టెక్నికల్ అసిస్టెంట్ షేక్ లాలఅహ్మద్ ఆధ్వర్యంలో గిరిజన గూడేల్లో సౌకర్యాల కల్పనకు శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. 17 సంబంధిత మంత్రిత్వ శాఖల సమన్వయంతో 25 రకాల కార్యాచరణలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గృహ విద్యుదీకరణ, జాతీయ ఆరోగ్య మిషన్, ఎఫ్ఆర్ఏ పట్టా గలవారికి స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, ఆదివాసి అతిథి గృహాలు, ఆదివాసి గ్రామ సడక్ యోజన కింద రోడ్ల నిర్మాణము, ఎఫ్ఆర్ఏ కేంద్రాలను నిర్మించడం, జాతీయ సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పించడం, అంగన్‌వాడి సేవలు, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, జలజీవన్ మిషన్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, హాస్టల్ ఏర్పాటు, టెలికం సాంకేతిక అభివద్ధి నిధి, నైపుణ్య భారత్ మిషన్ మొదలగు వాటిపై చెంచు ప్రజలకు అవగాహన కల్పించారు. అదే విధంగా ఇంటింటి సర్వే నిర్వహించి వారి యొక్క అవసరాలను గుర్తించి ఈ పథకం ద్వారా వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగార్జున సింగ్, ప్రధానోపాధ్యాయులు యు కనకయ్య, సుధాకర్, రవీంద్ర, వెలుగు సిసి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సిఎం జగన్‌తో 'వెన్నా' దంపతుల భేటీ

**ప్రజాశక్తి-మార్కాపురం**



జగన్‌తో వెన్నా..

వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వైసిపి రాష్ట్ర కార్యదర్శి, మార్కాపురం నియోజకవర్గ నాయకుడు వెన్నా హనుమారెడ్డి, ఆయన సతీమణి తర్లుపాడు జడ్‌పిటిసి ఇందిర శుక్రవారం భేటీ అయ్యారు. మార్కాపురం నియోజకవర్గ పరిస్థితిపై చర్చించారు. మొన్నటి ఎన్నికల్లో యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎన్నికల ప్రధాన బాధ్యుడుగా వెన్నా హనుమారెడ్డి వ్యవహరించారు. వైసిపి తరపున పోటీ చేసిన తాటిపర్తి చంద్రశేఖర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. గెలుపు కోసం కృషి చేసిన హనుమారెడ్డిని మాజీ సిఎం జగన్ అభినందించారు. జడ్‌పిటిసిగా ఉన్న వెన్నా ఇందిరకు గత ఎన్నికల ముందు వైఎస్ జగన్ జడ్‌పి చైర్మన్‌గా వెన్నా ఇందిరకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో వైసిపి అధికారాన్ని కోల్పోయింది. దీంతో జడ్‌పి చైర్మన్‌గా ఇచ్చిన హామీ అమలు కాలేదు. తాజాగా సిఎం జగన్‌తో ఈ విషయాన్ని వెన్నా హనుమారెడ్డి దంపతులు చర్చించినట్లు తెలిసింది. దీనిపై జగన్ సమాధానం ఏమిటనేది తెలియాల్సి ఉంది.

## 350 స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం పట్టణంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. తొలి విడతగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ వేగంగా చేస్తున్నారు. స్మార్ట్ మీటర్లతో వినియోగదారులకు నష్టమేనంటూ ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. డిసెంబర్ వరకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ సాగుతుందని అప్పటి వరకు పాత పద్ధతిలోనే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. యర్రగొండపాలెం పట్టణంలో 350 స్మార్ట్ మీటర్లు ఇప్పటి వరకు బిగించినట్లు విద్యుత్ ఏఈ తలపాటి అల్లూరయ్య శుక్రవారం తెలిపారు.

## ప్రభుత్వాల ఏర్పాటులో యువత పాత్ర కీలకం

**మార్కాపురం తహశీల్దార్ చిరంజీవి**

**ప్రజాశక్తి-మార్కాపురం**




మాట్లాడుతున్న తహశీల్దార్ చిరంజీవి

ప్రపంచంతో పోటీపడి మన దేశం అభివృద్ధి మార్గంలో పయనించాలంటే అందుకు సామర్థ్యం కలిగిన ప్రభుత్వాలను ఎన్నుకోవడం అవసరమని మార్కాపురం తహశీల్దారు కె.చిరంజీవి పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యావంతులైన యువత పాత్ర కీలకమని ఆయన సూచించారు. స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన నూతన ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో తహశీల్దారు చిరంజీవి పాల్గొని కీలక ప్రసంగం చేశారు. ఉన్నత వ్యక్తిత్వం గల నాయకులను, దేశాభివృద్ధి పట్ల చిత్తశుద్ధి గల నేతలను ఎంపిక చేసుకోవడంలో విద్యావంతులుగా ఆలోచనా శక్తిని వినియోగించాలన్నారు. నైరాశ్య భావాన్ని వీడాలని, యువతీ, యువకులు ఎన్నికల ప్రక్రియలో తమ బాధ్యత నిర్వహించాలన్నారు. డిప్యూటీ తహశీల్దారు ఎం.ప్రభావతి మాట్లాడుతూ 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండనున్న వారందరికీ ఎన్నికల సంఘం గుర్తింపు కార్డు మంజూరు చేస్తుందన్నారు. ఫారం-6 ద్వారా అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర్‌కుమార్, ప్లేస్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ కె.పవన్‌కుమార్, రీసెర్చ్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.శేషుకుమార్, కళాశాల అకడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ పిఆర్‌కె ప్రసాద్, బిసిడిఇ కో ఆర్డినేటర్ ఎంవి రాఘవేంద్ర, ఇతర అధ్యాపక బృందంతో పాటు ఎన్నికల విభాగం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

**- విద్యార్థులకు వాటికి దూరంగా ఉండాలి**

**- ఒంగోలు వన్‌టౌన్ సిఐ నాగరాజు**

**ప్రజాశక్తి-ఒంగోలు క్రైం**



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ నాగరాజు

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక అనర్థాలు కలుగుతాయని, వ్యసనాలకు బానిసలై.. జీవితాలను నాశనం చేసుకోవద్దని, మాదకద్రవ్యాలు మీ దరి చేరకుండా స్మార్ట్‌గా వ్యవహరించాలని ఒంగోలు వన్‌టౌన్ సిఐ నాగరాజు విద్యార్థులకు సూచించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఒంగోలులోని ఎన్ఆర్ఐ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. సిఐ నాగరాజు మాట్లాడుతూ గంజాయి లాంటి డ్రగ్స్ రవాణా చేసినా, అమ్మినా, సేవించినా కేసులు నమోదు చేయబడతాయన్నారు. ఒకసారి డ్రగ్ కేసుల్లో పట్టుబడి పోలీసు రికార్డ్స్‌లో పేరు నమోదయితే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందలేరని చెప్పారు. విద్యార్థులు క్రమ శిక్షణతో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా మరియు ట్రాఫిక్ నియమాలు గురించి విద్యార్థులకు వివరించారు. సైబర్ మోసాలకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వెల్లడించారు. ఏదైనా అత్యవసర సమయంలో పోలీసు వారి సహాయం పొందాలంటే ఎటువంటి సమయంలోనైనా సమీపంలోని పోలీస్ స్టేషన్ కు లేదా డయల్ - 100/112 కు కాల్ చేయడం ద్వారా సత్వర సాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మూడు నెలలుగా నీటి వృథా

**- ప్రజలకు తప్పని తాగునీటి ఇక్కట్లు - పట్టించుకోని అధికారులు**

**ప్రజాశక్తి-మార్కాపురం**



రహదారిపై వృథాగా పోతున్న నీరు

మార్కాపురం మున్సిపాలిటీలో రెండో వార్డు పరిధిలోని ఏకలవ్య కాలనీలో తాగునీరు వృథా అవుతోంది. పైప్‌లైన్ జాయింట్ ఊడిపోవడంతో తాగునీరు రహదారి పాలవుతోంది. మూడు నెలలుగా నీటి వృథా జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా అక్కడి ప్రజలు తాగునీటి ఇక్కట్లకు గురవుతున్నారు.

మార్కాపురం మున్సిపాలిటీలోని రెండో వార్డులో గల ఏకలవ్య కాలనీలో కార్మికులే అధికం. సమీపంలోని పలకల పారిశ్రామిక వాడలో జీవనోపాధి పొందుతున్నారు. వారందరికీ నీటి సరఫరా సకాలంలో లేకపోతే నీటి కోసం ఇబ్బందులు పడక తప్పదు. సమయానికి కంపెనీల్లో విధులకు వెళ్లలేకున్నారు. నీటి సరఫరాలో అంతరాయంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థానికులు నీటిని సేకరించుకోవాల్సి వస్తోంది. పైప్‌లైన్ జాయింట్ అమర్చగలిగే సమస్య తొలగిపోయేది. నీటి వృథాతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని, అక్కడ ప్రజలకు మున్సిపల్ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. పలకల పారిశ్రామికవాడ వద్దగల జాతీయ రహదారి-565 నుండి ఏకలవ్య కాలనీలోకి వెళ్లే మొదటి లైన్‌లో నీటి సరఫరా లైన్ జాయింట్ ఊడిపోయింది. నీటి సరఫరా సమయంలో తాగునీరు కాస్తా వృథాగా రహదారిపై ప్రవహిస్తోంది. అదే రహదారి దగ్గరలో పాఠశాల ఉంది. అక్కడ చదువుకునే విద్యార్థులు రహదారిపై నిలిచిన బురదనీటిలో నడవాల్సి వస్తోంది. అక్కడి ప్రజలకు రాకపోకల సమయంలో అసౌకర్యంగా ఉంది. చిన్నపాటి పనికి మూడు నెలల సమయం పట్టడమేంటని, ఎన్నిసార్లు చెప్పినా స్పందించరేమని స్థానిక అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి పైప్‌లైన్ జాయింట్ అమర్చాలని, నీటి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

## 'ఉండవల్లి'ని కలిసిన గూడూరి

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

రాష్ట్ర మాదిగ కార్పోరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవిని శుక్రవారం ఆమె కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో మాదిగల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్పోరేషన్ ద్వారా మాదిగల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి కమీషన్ చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన పొడపాటి తేజస్వికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## 'ఉపకార వేతనాల' మార్గదర్శకాలు జారీ

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘీక సంక్షేమ శాఖ ద్వారా మెట్రిక్ అనంతర ఉపకార వేతనాలకు నూతన మార్గదర్శకాలు జారీ అయినట్లు జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ ఎన్ లక్ష్మానాయక్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యాలకు తెలిపారు. డిగ్రీ నుంచి పీజీ వరకు టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సుల నందు కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు మెట్రిక్ అనంతరం ఉపకార వేతననాలు పొందువారు రెన్యువల్స్, నూతన ఉపకార వేతనాలకు సంబంధించి కళాశాలల ఖాతాలకు ట్యూషన్ ఫీజులు విడుదల చేయనున్నట్లు చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ విద్యార్థులకు మినహా మిగతా విద్యార్థులందరికీ ఎఫ్ఆర్ఎస్ హాజరు ఆధారంగా ఉపకార వేతనాలు కళాశాలల ఖాతాలకు విడుదల చేయబడునని తెలిపారు.

## టూరిజం చైర్మన్‌ను కలిసిన టిడిపి నేతలు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీని ఒంగోలులోని ఆయన కార్యాలయంలో శుక్రవారం యర్రగొండపాలెంనకు చెందిన టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుపై అసత్య ఆరోపణలు చేస్తూ గురువారం జరిగిన సంఘటన గురించి బాలాజీకి వివరించారు. కార్యకర్తలకు అండగా ఉంటుంటే ఆయనపై విషప్రచారం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా బీసీ సెల్ నాయకులు మూడమంచు శ్రీనివాస్ యాదవ్, బైలడుగుల వెంకటేశ్వర్లు, గిరిజన కో ఆపరేటివ్ డైరెక్టర్ చెవుల అంజయ్య, వెంకటాద్రిపాలెం సర్పంచ్ బోడా శ్రీశైలపతినాయుడు పాల్గొన్నారు.

## 25 వాహనాలకు జరిమానా

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ

పెద్దదోర్నాల పట్టణంలో శుక్రవారం ఎస్సై పి. మహేష్ శుక్రవారం నాడు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేని 25 వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. ప్రధాన రోడ్డు మార్గాలు, ముఖ్యమైన కూడళ్లలో వాహనాలు తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి ఈ జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రీ సర్వే సమస్యల పరిష్కార చర్యలు చేపట్టిన సిబ్బంది

## రెవెన్యూ సిబ్బందికి అందుబాటులో ఉండాలి

**ప్రజాశ క్తి - పంగులూరు**

మండలంలో రీ సర్వే జరిగిన ఆరు గ్రామాల్లో విస్తీర్ణ వ్యత్యాసాల సమస్యల పరిష్కారం కోసం ఆయా గ్రామాల రైతులు రెవెన్యూ ప్రత్యేక బృందాలకు అందుబాటులో ఉండి సహకరించాలని తహశీల్దారు పి సింగారావు కోరారు. రీ సర్వే గ్రామాల్లో తలెత్తిన భూ సమస్యల పరిష్కారం కోసం నియమించిన ప్రత్యేక సిబ్బంది శుక్రవారం నుండి గ్రామాల్లో చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.



పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ నూతన కార్యవర్గం ఎన్నిక

## ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

**ప్రజాశక్తి - రేపల్లె**

ఎపి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ డిపో ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు పి కమలాకర్, అధ్యక్షులు కె బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులు జెసిహెచ్ శేఖర్, విఎస్ఎస్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎస్ రావు, కార్యదర్శి డిఎస్ చిట్టిబాబు, కోశాధికారి వివి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఎల్‌వి రావు, ఎ నవీన్, సెక్రెటరీ ఎస్‌కె రహిమాన్, అసిస్టెంట్ కార్యదర్శులు బేబీ కుమారి, వి కనకారావు, పిఎస్ ఆంజనేయులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఎంవి రావు ,ఎన్‌వి సుబ్బారావు ఎన్నికయ్యారు. అనంతరం డిపో ఇంచార్జ్ మేనేజర్ రాజశేఖర్‌ను కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. డిపోలో సమస్యలు సమిష్టిగా పరిష్కరించుకుని ఐకమత్యంతో డిపో అభివృద్ధికి కృషి చేద్దామని అన్నారు. నూతన కార్యవర్గ సభ్యులను యూనియన్ నాయకులుఆకురాతి రంగనాథ్ అభినందించారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

## శారద ఐటిఐలో మెగా జాబ్ మేళా

**ప్రజాశక్తి - రేపల్లె**

స్థానిక శారద ఐటిఐ కాలేజీ నందు శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాలో ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కోల్గేట్ పామోలివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ బడుగు వెంకట నారాయణ తెలిపారు. ఐటిఐ ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, బిఎస్సి కంప్యూటర్స్, మైక్రోబయాలజీ కోర్సుకు చెందిన అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. వీరిలో 4 గురు ఐటిఐ, 4 డిగ్రీ అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14,500 నుండి రూ.16,400 వరకు వేతనం వుంటుందని తెలిపారు. కంపెనీ ఇచ్చే ఇతర సౌకర్యాలు అదనంగా వుంటాయని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ బి వెంకటేష్, ప్రిన్సిపాల్ బడుగు జ్యోత్స్న, ప్లేస్మెంట్ ఆఫీసర్ ప్రసాద్ పాల్గొన్నారు.

# రాజకీయ కక్షతోనే వంట కార్మికురాలి తొలగింపు

- ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా
- విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

**ప్రజాశక్తి - చీరాల**

గత 14 ఏళ్లుగా కెజిఎం బాలికోన్నత పాఠశాల్లో మధ్యాహ్నం భోజన వంట కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న కాగితాల పుష్పలతను రాజకీయ కక్షతోనే విధుల నుండి తొలగిస్తూ ఎంఈఓ ఉత్తర్వులు జారీ చేశారని సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు ఆరోపించారు. కార్మికురాలు పుష్పలతను విధుల తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంఈఓ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత 14ఏళ్లుగా రాని పిర్యాదులు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. తొలగింపు ఉత్తర్వులతో మనస్తాపానికి గురై ఆత్మహత్య ప్రయత్నం చేసి చికిత్స పొందుతున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఆమెపై ఎలాంటి పిర్యాదులు లేవని అన్నారు. ఈ నెల 7న ఎపి ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సిహెచ్ ప్రతాపరెడ్డి పాఠశాల సందర్శించి మెనూ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారని గుర్తు చేశారు. గత నెలలో చీరాల కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధా సందర్శించి పిల్లలతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేసారని అన్నారు. ఉన్నత అధికారులు కుడా కొద్దిరోజుల క్రితం మధ్యాహ్న భోజనంపై సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. పాఠశాల హెచ్ఎం, ఎంఈఓ కేవలం రాజకీయ కక్షలు నేపథ్యంలో కార్మికురాలిని తొలగించడానికి ఉత్తర్వులు ఇవ్వడంతోనే భాగోద్వేగానికి గురైన ఆమె ఆత్మహత్యా ప్రయత్నం చేసిందని అన్నారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాగిత కిషోర్, ఎస్‌కె కాలేషా, ఐవి ప్రసాద్, జి సుజీవన, విజయలక్ష్మి, ఇంద్రాణి, భార్గవి, కాంతమ్మ, సిరిపురం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

# పప్పు దినుసుల సాగు లాభదాయకం

**ప్రజాశక్తి - పంగులూరు**

పప్పుదినుసుల సాగు చేపట్టడం ద్వారా రైతులు మరింత లాభసాటిగా వ్యవసాయాన్ని మార్చగలుగుతారని ఎఓ డి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాల్లో పొగాకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. పొగాకు వాడకం వలన మనుషుల ఆరోగ్యం పాడవుతుందని అన్నారు. అధికంగా సాగు చేయడం వలన డిమాండ్ తగ్గి రైతులు నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. మొక్కజొన్నలో మేలైన యాజమాన్య పద్దతులు, చీడ పీడల నివారణ గురించి వివరించారు. ఖరీఫ్‌లో పండించిన వరి ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. క్వింటాకు రూ.2320, సాధారణ రకం రూ.2300 తెలిపారు. గోనె సంచులు, లేబర్ ఛార్జీలు, మిల్లుకు చేరే వరకు రవాణా ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. రైతులు ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాల ప్రకారం ఉండేటట్ల చూసుకోవాలని అన్నారు. తేమ శాతం 17శాతం ఉండేటట్లు ఆరబెట్టుకోవాలని తెలిపారు. 2024-25 నుండి రైతు సాగుచేసిన వరికి తప్ప అన్నీ పంటలకు డిసెంబర్ 15లోపు, వరికి డిసెంబర్ 31లోపు పంటల బీమ చేయించాలని తెలిపారు. వరికి ఎకరాకు రూ.126, మొక్కజొన్న ఎకర రూ.105, శెనగ ఎకరాకు రూ.84 సిఎస్సిలోగాని, సచివాలయంలోగాని చెలించి రశీదు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సైలీష్, అక్షరణి, కోటపాడు పంచాయతీ కార్యదర్శి, నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**పర్చూరు :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న 'ప్రధాన మంత్రి ఫసల్ పంటల భీమా యోజన' పథకాన్ని రైతులు సధ్వనియోగం చేసుకోవాలని ఏఒ రామ మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. 2024-25 రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు, సాగు చేయబోతున్న పంటలకు ఈ భీమా వర్తిస్తుందని తెలపారు. నేషనల్ ఇన్సూరెన్సు పోర్టల్ ద్వారా నమోదు చేసుకోలన్నారు. ఆధార్, పొలం పాసుబుక్, బ్యాంకు అకౌంట్ జీరాక్స్‌లతో పాటు రైతు సేవా కేంద్రంలో ఇచ్చిన పంటల ధ్రువీకరణ పత్రం, రైతు ఫోన్ నెంబర్‌తో సిఎస్సి సెంటర్‌కు వెళ్లి పంటల భీమా చేయించు కోవాలని తెలపారు. కౌలు రైతు కార్డు కలిగిన కౌలు రైతులు కూడా అర్హులని తెలిపారు. రైతులు వినియోగించుకోవాలని ఎఒ తెలపారు.



ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ

**కొల్లూరు :** మండలంలోని చిలుమూరు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు గురించి రైతులకు వ్యవసాయ అధికారి ఆర్ వెంకటేశ్వరరావు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల వద్ద కొనుగోలు చేస్తామని తెలిపారు. తప్పనిసరిగా ఈ పంట ఈ కెవైసి చేయించుకున్న రైతుల వద్ద నుండి మాత్రమే కొనుగోలు చేస్తామని తెలిపారు. ధాన్యం అమ్మే ప్రతి రైతు బయోమెట్రిక్ వేలిముద్రలు వేయవలసి ఉంటుందని తెలిపారు. సంబంధిత రైతులు సేవా కేంద్రమునకు వచ్చి వేలిముద్రలు వేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ధాన్యంను వాహనంలో లోడింగ్ చేసిన దగ్గర నుండి రైస్ మిల్లుల వద్ద అన్ లోడింగ్ అయ్యే వరకు జిపిఎస్ పరికరాన్ని అమర్చి మాత్రమే ధాన్యాన్ని రవాణా చేయవలెనని అన్నారు. ఒకవేళ రైతులు గోనె సంచులు, హమాలి, రవాణా ఖర్చులు పెట్టుకుంటే ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆ ఖర్చు నేరుగా రైతులు ఖాతాలో ధాన్యం సొమ్ముతో సహా చెల్లించనున్నట్లు తెలిపారు. కాబట్టి రైతులు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని తెలిపారు.



విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న నిర్వాహకులు

## విజేతలకు బహుమతులు

**ప్రజాశక్తి - బాపట్ల**

రాజ్యాంగ దినోత్సవాన్ని సందర్భంగా వివిధ అంశాలపై జిల్లా స్థాయిలో విద్యార్థులకు స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈనెల 25న జోనల్ స్థాయిలో జరిగే పోటీలకు హాజరవుతారని ఎంఈఓ డి ప్రసాదరావు తెలిపారు. వ్యాసరచనలో కొల్లూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్ సాయి నాగ సూర్య, బాపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌కె జాహురా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వకృత్వ పోటీల్లో కొల్లూరు జెడ్‌పి హైస్కూలు విద్యార్థి జస్వంత్, భట్టిప్రోలు మండలం సూరేపల్లికి చెందిన ఎస్ నవ్య ప్రథమశ్రేణిలో నిలిచారు. చీరాల ఎపి మోడల్ స్కూల్ విద్యార్థి ఎ రోహిత్ బాబు, ఎ అభిషేక్, అద్దంకి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం సాయి సమీరా, పి లక్ష్మీదేవి మొదటి బహుమతి, క్విజ్ పోటీల్లో చీరాల ఎపి మోడల్ స్కూల్ విద్యార్థి పివిఎన్ఎస్ సంతోష్, ఈపురుపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థి జి వేదశ్రీ ప్రథమ, దేశభక్తి గేయాల ఆలాపనలో పేరాల ఎఆర్ఎంఎం ఉన్నత పాఠశాల విద్యార్థి ఎండి ఆఫన్, చీరాల ఎపి మోడ ల్ స్కూల్ విద్యార్థి కె మనస్విని ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ పాల్గొన్నారు.

**అద్దంకి :** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బాపట్ల మునిసిపల్ ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన జిల్లాలో స్థాయి వక్తృత్వ పోటీల్లో మండలంలోని చక్రాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థిని అద్దంకి అమృత ప్రథమ స్థానం సాధించారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ సాదిక్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందించారు.

# జీడిపప్పు దినోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి - వేటపాలెం**

జాతీయ జీడిపప్పు దినోత్సవ వేడుకల సందర్భంగా జీడిపప్పు కార్మికులకు వివిధ రకాల కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. నవంబర్ 23న జాతీయ జీడిపప్పు దినోత్సవం సందర్భంగా రావి మస్తాన్‌రెడ్డి, బక్క సీతారామమ్మను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జీడిపప్పు ఉత్పత్తిదారుడు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 23న జాతీయ జీడిపప్పు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీడిపప్పు ఎంత కమ్మదనమో అందులో పని చేసే కార్మికుల నైపుణ్యం అంతే మోతాదులో ఉంటుందని అన్నారు. జీడిపప్పు వన్నెగలిగి, పప్పు వినియోగదారులకు మనసుకు హత్తుకుంటుందని అన్నారు. జీడిపప్పు ఉత్పత్తిలో సాంకేతిక విధానం అమల్లోకి వచ్చిప్పటికీ బాయిలింగ్ సిస్టం పీలింగ్ మిషన్స్, స్టార్టింగ్ మిషన్స్ వచ్చిన తర్వాత కార్మికుల అవసరం తగ్గుతుందని అన్నారు. కార్మికులచే వలిచిన జీడిపప్పుకు ఉన్న నాణ్యత, మిషన్ ద్వారా పొట్టు ఊడదీసిన పప్పు రుచికి తేడా వివరించారు. జీడిపప్పు పరిశ్రమలో క్రమంగా కార్మికుల అవసరం తగ్గుతుందని అన్నారు. నైపుణ్యం గల కార్మికుల అవసరం ఎంతైనా ఉందని అన్నారు. జీడిపప్పు దైనందిన జీవితంలో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించిందని అన్నారు. జీడిపప్పులో కొవ్వును కరిగించే గుణం ఉందని అన్నారు. జీడిపప్పు మధుమేహం, హృద్రోగ వ్యాధిగ్రస్తులు వాడవచ్చని వైద్యులు చెపుతున్నారని అన్నారు. జీడిపప్పులో క్యాల్షియం, పీచు పదార్థం కలిగి ఉందని అన్నారు. కార్యక్రమంలో ఉత్పత్తిదారులు చుండూరి నాగాంజనేయులు, రామకృష్ణ, కరణం మురళీకృష్ణ, హరి ప్రసాదరావు, భాస్కర్, రమేషు, అయ్యప్ప, సత్యానందం, రజిని, రోశమ్మ, మున్ని, గుల్జారా, భువనేశ్వరి, సుజాత, సునీత, సుబ్బులు, మాబు, వల్లి, పద్మ పాల్గొన్నారు.



జీడి బట్టీ కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

## సిఎం సహాయ నిధికి వితరణ

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

ముఖ్యమంత్రి సహాయనిదికి జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ నుండి రూ.8.33లక్షలు అందజేసినట్లు రేషన్ డీలర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు టి రవిచంద్రరెడ్డి తెలిపారు. విజయవాడలో వచ్చిన వరదల కారణంగా నష్టపోయిన ప్రజల కొరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంఘాల రేషన్ డీలర్ల ప్రతినిధుల నిర్ణయం మేరకు నవంబర్ నెలలో వచ్చే కమిషన్ నుండి ప్రతి రేషన్ డీలర్‌కు వచ్చే కమిషన్ నుండి 15శాతం చొప్పున సిఎం సహాయ నిధికి పౌర సరఫరాల శాఖ కమిషనర్ ద్వారా జమ చేసినట్లు తెలిపారు.

## ఘనంగా ములాయం సింగ్ జయంతి

**ప్రజాశక్తి - బాపట్ల**

ములాయం సింగ్ యాదవ్ 85వ జయంతిని సమాజవాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధ శ్రీనివాసరావు సమన్వయంతో శుక్రవారం బాపట్లలో ఘనంగా నిర్వహించారు. ములాయం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. లంబు సాంబయ్య యాదవ్, కాంగ్రెడు శరత్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి



శనివారం 23 నవంబర్ 2024

# ఖోఖో రాష్ట్ర బాలుర జట్టుకు ముగిసిన శిక్షణ

**ప్రజాశక్తి - పంగులూరు**

ఈనెల 25నుండి 29వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆలీఘర్ పట్టణంలో జరిగే 43వ జూనియర్ బాల, బాలికల జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే ఎపి బాలుర జట్టుకు శిక్షణ ముగిసిందని ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో 20రోజుల పాటు శిక్షణ జరిగినట్లు తెలిపారు. ఈ జట్టుకు ప్రకాశం జిల్లా డీఎస్ఎ కోచ్ డిఎల్ రెడ్డి కోచ్‌గా వ్యవహరించారని తెలిపారు. క్రీడాకారులకు గత 20 రోజుల నుండి భోజన వసతి కల్పించిన గ్రామ పెద్దలకు, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావుకు సీతారామిరెడ్డి, జట్టు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేసిన నెల్లూరు జిల్లా పిడి రాజా,



జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు

బాలికల జట్టుకు క్రీడా దుస్తులు ఎస్సార్ స్పోర్ట్స్ తరపున మేకల జయరామిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు అందించారు. వీరికి ఖోఖో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె భాస్కరరావు, బి కాశీ విశ్వనాథరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బాలుర జట్టుకు క్రీడా దుస్తులను ఖోఖో అకాడమీలో పెద్దలు రాయిని వెంకట సుబ్బారావు, బాచిన చౌదరి బాబు, మేకల సీతారామిరెడ్డి పంపిణీ చేశారు.

**రాష్ట్ర ఖోఖో బాలుర జట్టు వివరాలు**

జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో బాలురు జట్టు వివరాలను రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారాంరెడ్డి ప్రకటించారు. ప్రకాశం జిల్లా నుండి ఎస్ మహేష్ బాబు, ఐ వీరేంద్ర, జి ప్రవీణ్ కుమార్, ఎన్ భరత్ కుమార్, సిహెచ్ బాజీ బాబు, కృష్ణా జిల్లా నుండి టి తిమోతి, ఎస్కె ఆసిఫ్ ఖాన్, కె జయసూర్య తేజ, కర్నూలు జిల్లా నుండి కె వీరేష్, తూర్పుగోదావరి జిల్లా నుండి బి గౌరీ శంకర్, విజయనగరం జిల్లా నుండి టి రవి, విశాఖపట్నం జిల్లా నుండి పి జయవర్ధన్, చిత్తూరు జిల్లా నుండి ఎన్ హరికాంత్, పి వరుణ్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ జట్టుకు మేనేజర్ ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్కె అహ్మద్ వ్యవహరిస్తారని తెలిపారు.

## ఆనందబాబుకు శుభాకాంక్షలు

**ప్రజాశక్తి - వేమూరు**



నక్కా ఆనందబాబు

పిఎసి కమిటీ సభ్యులుగా ఎన్నికైన శాసన సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబుకు నియోజకవర్గ టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆనందబాబు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు అనగాని ఏడుకొండలు, మాచర్ల నాగరాజు, వాకా శేషుబాబు, యడ్ల జయాశీలరావు, దీపాల ప్రసాద్ పాల్గొన్నారు.




రికార్డులు పరిశీలిస్తున్న చీరాల డిఎస్‌పి మహ్మద్ మొయిన్

## చోరీ కేసులు ఛేదించాలి

**ప్రజాశక్తి - పంగులూరు**

చోరీ కేసులు త్వరగా ఛేదించాలని చీరాల డిఎస్‌పి మహ్మద్ మొయిన్ సూచించారు. రేణంగవరం పోలీసు స్టేషన్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. వివిధ కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవస్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఆయన వెంట అద్దంకి రూరల్ సిఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐ వినోద్‌బాబు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి - పంగులూరు**

మండలంలో శనివారం సాయంత్రం రెండు గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జెఇ ఆంజనేయులు శుక్రవారం తెలిపారు. విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు.

**రేపల్లె :** పట్టణంలో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పేటేరు సబ్ స్టేషన్ నుండి రైల్వే స్టేషన్ వరకు పోస్ట్ ఆఫీస్ రోడ్డు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఎఇ ఎ నాగిరెడ్డి తెలిపారు.

## పంట కోత ప్రయోగం

**ప్రజాశక్తి - అమృతలూరు**

మండలంలోని పాంచాడవరం గ్రామంలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా' పంట కోత ప్రయోగం చేపట్టారు. ముందుగా ఎంపిక చేసిన రైతులు గోవాడ సాంబశివరావు, అమెరి వాసుకు చెందిన పంట పొలాల్లో కోత ప్రయోగ చేపట్టగా సున్నా దిగుబడి లభించిందని ఎఒ ఉయ్యూరు లోకేశ్వరి తెలిపారు. ఈ పంట ప్రయోగాన్ని బాపట్ల ఎడిఎ ఎ లక్ష్మి పర్యవేక్షించారు.

# పేదల స్థలం తనదేనంటూ ఎన్ఆర్ఐ నోటీసులు

**ప్రజాశక్తి - బల్లికురవ**

మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీ పరిధిలోని సిపాయి కాలనీ వాసులకు ఎన్ఆర్ఐ సత్య నరేంద్ర కుమార్ గుట్టు చప్పుడు కాకుండా కోర్టు ద్వారా నోటీసులు ఇప్పించాడు. గత 35ఏళ్లుగా కాలనీలో నివాసం ఉంటున్న 25 కుటుంబాలకు నోటీసులు ఇప్పించడం విడ్డూరంగా ఉందని ఆ కాలనీ ఆ కాలనీవాసులు వాపోతున్నారు. 2007, 2017లో ప్రభుత్వం సర్వే నంబర్ 36, 37లలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇల్లు కూడా నిర్మించి ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులు ప్రభుత్వానికి అప్పు చెల్లించగా ప్రభుత్వం వారికి రిజిస్ట్రేషన్ పత్రాలు కూడా చేశారు. ఇన్ని ఆధారాలు ఉన్నప్పటికీ సత్య నరేంద్ర కుమార్ తన భూమి అని కోర్టుకు వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని కాలనీ వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఎస్టీలమైన తమకు అన్యాయం జరుగుతున్న ప్రభుత్వ పెద్దల నుంచి స్పందనలేదని వాపోతున్నారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన నివేశన స్థలాలు ఖాళీ చేసేది లేదని అంటున్నారు. కోర్టుకు తప్పుడు పత్రాలు సమర్పించి తమను ఇబ్బందులకు గురి చేయడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. తమ బ్రతుకేదో తామను బ్రతకనివ్వాలని తిరువీధుల నాగేంద్రం, తలపల లక్ష్మి మరి కొంతమంది ప్రజాశక్తి ముందు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. పేదలకు అండగా ఉంటామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. సిపాయి కాలనీని వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులైన గొల్లమూడి అంజయ్య, కోటేశ్వరరావు బృందం సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పేదలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. న్యాయపోరాటం ద్వారా ఎన్ఆర్ఐ సత్య కుమార్‌ను అడ్డుకొని న్యాయం జరిగేంత వరకు పోరాటం చేద్దామని అన్నారు.

# గోల్డ్‌ఫైనాన్స్ మోసంపై ఫిర్యాదు

**ప్రజాశక్తి - అద్దంకి**

పట్టణంలోని కీర్తన గోల్డ్ ఫైనాన్స్‌లో బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణం చెల్లించినా బంగారం ఇవ్వపోగా బాధితుడిని బెదిరించిన ఉద్యోగులపై బాదితుడు స్థానిక పోలీసు స్టేషన్లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ముండ్లమూరు మండలం శంకరాపురం గ్రామానికి చెందిన మేదరమెట్ల సీతారామయ్య కుమారుడు హరికృష్ణ పట్టణంలో నివాశం ఉంటూ కొత్త ఇళ్ళకు ఇంటీరియర్ డిజైన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వ్యవసాయ పనులు నిమిత్తం తన దగ్గర ఉన్న బంగారు ఆభరణాలను పట్టణంలోని బంగ్లా రోడ్డులోని కీర్తన గోల్డ్ ఫైనాన్స్‌లో గత జూన్ 10న తాకట్టు పెట్టి రూ. 3,94,416నగదు రుణంగా తీసుకున్నట్లు తెలిపారు. బాదితుని బంధువులకు ఈ విషయం తెలిసి ఫైనాన్స్ వడ్డీలు ఎక్కువగా ఉంటాయని చెప్పి బందువులు నగదు ఇవ్వడంతో బాధితుడు వెంటనే అదే రోజు ఫైనాన్స్‌కు వెళ్లి రుణం చెల్లించడానికి రూ. 3,75, 675 బ్యాంకులో నగదు ట్రాన్స్‌ఫర్ చేసి మిగిలిన రుణాన్ని నగదు రూపంలో ఉద్యోగికి అందజేశారు. ఆ ఉద్యోగులకు రుణాన్ని చెల్లించారు. అయితే వెంటనే మీ బంగారు ఆభరణాలు ఇవ్వడానికి కుదరదని, కొన్ని రోజులు సమయం ఉండాలని తెలిపారు. బాదితుడు కూడా సరే కొంత సమయం తరువాత వస్తానని వెళ్లారు. బాదితుడు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో కొంత సమయం చికిత్స తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఫైనాన్స్‌లో ఉద్యోగులుగా పనిచేస్తున్న ఎన్ నాగలక్ష్మి, పి అంకమరావు అనే ఇద్దరు సెప్టెంబర్ 26న బాధితుని స్వగ్రామమైన శంకరాపురంలోని బాదితుని తండ్రి వద్దకు వెళ్లి మీ కుమారుడు బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారని, ఆ రుణం చెల్లించని కారణంగా తాకట్టు పెట్టిన బంగారం వేలంకు వచ్చిందనీ చెప్పి డబ్బులు కట్టించుకొన్నారని తెలిపారు. ఆ విషయం బాదితుడుకు తెలిసి ఫైనాన్స్ ఆఫీసుకు వెళ్లి తాను బంగారం ఆభరణాలు రుణానికి డబ్బులు చెల్లించినా, తమ తండ్రి దగ్గరకు వెళ్ళి ఎలా డబ్బులు తీసుకున్నారని ప్రశ్నిస్తుంటే ఆ ఉద్యోగులు నీ దిక్కు ఉన్న చోట చెప్పుకోమని బెదిరించగా ఏమి చేయలేక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాదితుని ఫిర్యాదు మేరకు ఆ ఇరువురి ఉద్యోగులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# నాటు సారా తయారీ స్థావరంపై దాడులు

**ప్రజాశక్తి - నిజాంపట్నం**

నాటు సారా తయారీ స్థావరంపై దాడులు నిర్వహించినట్లు నగరం ఎక్సైజ్ సీఐ శ్రీరామ్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని దిండి పంచాయితీ పరిధిలోని జంపనివారిపాలెం పరిసర ప్రాంతాల్లో తమ సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో నాటు సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల బెల్లపు ఊట, ఒక నాటుసారా తయారీ బట్టిని ధ్వంసం చేశామని చెప్పారు. నాటు సారాని తయారు చేసే, అమ్మే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంటుందని చెప్పారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాటు సారా తయారీ, అమ్మకాల గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని



నాటుసారా బట్టీలు ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మండలంలో నాటు సారా తయారీ దారుడికి నల్లబెల్లం అమ్మేవారిపై ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ కె వెంకట రమణ, కె శ్రీనివాసరెడ్డి, స్టేషన్ డ్రైవర్ పి భాస్కర్ పాల్గొన్నారు.

## బోధనేతర పనులు తగ్గించాలి

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

ఉపాధ్యాయులకు బోధనేతర పనులుతగ్గించి, ఒత్తిడి లేకుండా చేయాలని యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు ఎస్ పాపారావు డిమాండ్ చేశారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ సభ నిర్వహించారు. ఉపాధ్యాయులకు వృత్తిరీత్యా రావలసిన బకాయిల శ్వేత పత్రం విడుదల చేయాలని అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి యు చెంచయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులను బదిలీ చేసేటప్పుడు ఒక ప్రణాళిక ప్రకారం ఏడాదిలో క్రమ పద్ధతిలో జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పని ఒత్తిడి పెంచే యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. రిటైర్డ్ ఎంఈఓ కాకి జయరాజు, వివిధ పాఠశాలల రిటైర్డ్ హెచ్ఎంలైన కరి కమలేశ్వరరావు, ఆవుల హనుమంతరావు, పివి సుబ్బారావు, కె వీరాంజనేయులు, ఉదయ కుమారి, సిహెచ్ హనుమంతరావు, పి సత్యనారాయణ ఉన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ప్రజాశక్తి - చీరాల**

ఆదివాసీల సమస్యలపై బిర్సా ముండా చేసిన ఉద్యమాలు చిరస్మరణీయమని ఎంఇఒ పుల్లెల సుబ్రహ్మణ్యశ్వరరావు అన్నారు. స్థానిక ఎన్ఆర్ పిఎం ఉన్నత పాఠశాలలో ఆదివాసీ స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజానీకాన్నిచైతన్యం చేసి పోరాడిన గొప్ప యోధుడు బిర్సాముండా అని అన్నారు.

## ఔషధ మొక్కలతో అందరికీ ఆరోగ్యం

**ప్రజాశక్తి - అద్దంకి**

ఐఈఈఆర్డి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఔషధ మొక్కల బోర్డు ఆయుష్ మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ ఆర్థిక సౌజన్యంతో శుక్రవారం అద్దంకి ప్రభుత్వ బాలికల, బాలుల జడ్పీ హైస్కూల్లో ఎంఈఓ బి సుధాకరరావు ఔషధ మొక్కల ఉపయోగాలను వివరించారు. ఔషద మొక్కలపై ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా ఔషధ మొక్కలు పంపిణీ చేశారు. ఔషధ మొక్కలపై అవగాహన కలిగిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఐఈఈఆర్డి సేవా సంస్థ అధ్యక్షులు బి కిరణ్ చంద్ మాట్లాడుతూ మన పూర్వీకులు వైద్య విధానంలో ఔషధం మొక్కలు కీలక పాత్ర పోషించాయని అన్నారు. పాఠశాలల్లో వేప, తులసి, అలోవెర, అశ్వగంధ, బ్రహ్మి, ఉసిరి, తమలపాకు, ఎర్రచందనం, ఇన్సూరెన్స్ ప్లాంట్, రణపాల, నల్ల పసుపు, పుదీనా, సన్న ఔషధ మొక్కలను నాటారు.

## ప్రత్యామ్నాయ పంటను సాగు చేయాలి

**ప్రజాశక్తి - అద్దంకి**

పొగాకు సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. మండలంలోని కుంకుపాడు, కోటికలపూడి గ్రామంలో రైతులతో ఆయన మాట్లాడారు. వరి, మొక్కజొన్న, శనగ, మినుము, పెసర, వేరుశనగ, జొన్న పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ భీమా చేయించుకోవాలని సూచించారు. భీమా గడువు డిసెంబర్ నెల 15తో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు లక్ష్మి తులసి, గాలం వెంకటేశ్వర్లు, చంద్ర బ్రహ్మయ్య పాల్గొన్నారు.

## పెన్షన్లపై మార్గదర్శకాలు

**ప్రజాశక్తి - పంగులూరు**

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసిందని ఎంపిడిఒ కె స్వరూప రాణి శుక్రవారం తెలిపారు. కొత్త నిబంధనలు ప్రకారం నవంబర్ 2024 నెలకు సంబంధించి 2024 డిసెంబర్ 1న తీసుకొను పెన్షన్ నుండి మొదటి, రెండు నెలలు ఏ కారణం చేతనైన తీసుకొనలేకపోతే వారిని తాత్కాలిక వలసగా నమోదు చేసి మూడవ నెలలో గత రెండు నెలలు పెన్షన్ నగదు కలిపి పెన్షన్ దారునికి చెల్లిస్తారని చెప్పారు.

**చెరుకుపల్లి :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను రెండు నెలలు తీసుకోకపోయినా 3వ నెలలో మొత్తం పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు.

# హింసకు వ్యతిరేకంగా పక్షోత్సవాలు

## ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపు

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

సమాజంలో రోజురోజుకు మహిళలపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఈనెల 25 నుండి అంతర్జాతీయ హింసా వ్యతిరేక దినోత్సవం నుంచి డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం వరకు పక్షం రోజులపాటు హింసకు వ్యతిరేకంగా జరిగే ప్రచార ఉద్యమాన్ని జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మహిళలపై చిన్నారులపై జరుగుతున్న ఘోరాలు, క్రైమ్ రేటు విపరీతంగా పెరుగుతుందన్నారు. దేశంలో ఏదో ఒక మూల ప్రతి నిమిషం ఒక అఘాయిత్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం మద్యం మత్తుపదార్థాలకు నిలయంగా మారిందని, అత్యాచారాలు



మాట్లాడుతున్న రమాదేవి

దాడులు, దౌర్జన్యాలు పెరిగేందుకు ఇవి దారి తీస్తున్నాయన్నారు. మద్యం, మత్తు పదార్థాలు నిషేధించి హింసను అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 25 నుండి డిసెంబర్ 10 వరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రచార ఉద్యమాన్ని మహిళలపై హింసను వ్యతిరేకించే వారందరూ బలపరచి భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం లో ఐద్వా జిల్లా నాయకులు ఎన్. మాలతి, జి. ఆదిలక్ష్మి, కె.రాజేశ్వరి, బి.పెద్దగోవిందమ్మ పాల్గొన్నారు.

---

ల్యాండ్ బ్యాంక్ కోసం

# ఖాళీ భూములను గుర్తించాలి..

## అధికారులకు కలెక్టర్ ఆదేశం

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

ల్యాండ్ బ్యాంక్ కోసం రెవెన్యూ అధికారులు ఖాళీ భూమిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి ఆదేశించారు. అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. 13 అంశాలపై అధికారులతో సమీక్షించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి కేటాయించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం ప్రతి మండలంలో ప్రధాన కూడలిలో ఖాళీగా ఉండే భూమి గుర్తించాలన్నారు. ఎస్టీలకు ఆధార్ కార్డులు జారీ చేయాలని సూచించారు. ఆధార్ వచ్చిన తర్వాత పలు పథకాలు వర్తింపజేయాలన్నారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీకి అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. పెండింగ్ లో ఉన్న 5,375 దరఖాస్తులను పరిశీలించాలన్నారు. నీటి సంఘాల ఎన్నికలు డిసెంబర్ 8, 11, 14వ తేదీలలో సమర్థంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల అధికారుల నియామకం పూర్తయిందన్నారు. ధాన్యం సేకరణ వారం రోజుల్లో అధికారులు ప్రారంభించాలని జిల్లా


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు అనుబంధ శాఖల జిల్లా అధికారులు, మండలాల నుంచి తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**వ్యక్తిగత మరుగుదొడ్లు ఖచ్చితంగా ఉండాలి**

ప్రతి గృహానికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఖచ్చితంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా రూపొందించిన వాల్ పోస్టర్ ను కలెక్టర్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

---

# విద్యారంగ అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

డిసెంబర్ 7న ప్రతి పాఠశాలలో 'మెగా పేరెంట్ టీచర్ మీటింగ్' నిర్వహించాలని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ చెప్పారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌పై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాజధాని నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. వీక్షణ సమావేశం ద్వారా జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి హాజరయ్యారు. ప్రతి విద్యార్థికీ హెల్త్‌కార్డులు జారీ చేస్తామని ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిధర్ ప్రకటించారు. ప్రయోగాత్మకంగా ప్రతి నియోజకవర్గానికి ఐదు పాఠశాలలను ఎంపిక చేసి.. అందులోని


వీక్షణ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి

విద్యార్థులందరికీ హెల్త్ కార్డులు ఇస్తామన్నారు. 'బడి వైపు ఒక అడుగు-తల్లిదండ్రులతో ముచ్చట్లు' కార్యక్రమాల నిర్వహణపై ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికీ అపార్ ఐడి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీక్షణ సమావేశంలో జిల్లా నుంచి విద్యాశాఖ అధికారులు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

---

పింఛనుదారు మరణిస్తే

# జీవిత భాగస్వామికి వెంటనే పింఛన్

## కలెక్టర్ వెంకటమురళి

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద ఇప్పటికే ఉన్న పింఛనుదారు మరణిస్తే జీవిత భాగస్వామికి వెంటనే పెన్షన్ మంజూరు చేయబడుతుందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పెన్షన్ పొందుతూ 2024 నవంబరు 1న లేదా తరువాత మరణించిన పింఛనుదారు జీవిత భాగస్వామికి 2024 డిసెంబరు 1 నుండి పింఛన్ పొందేందుకు అర్హత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ప్రతినెల పెన్షన్ పంపిణీ పూర్తయిన తర్వాత చెల్లించని పెన్షనర్ల వివరాలు గుర్తించే విధంగా ఒక మొబైల్ యాప్ లో నమోదు చేయబడి ఉంటాయన్నారు. పెన్షన్ పొందేందుకు మరణించిన జీవిత భాగస్వామి వివరములు ఎస్.ఎస్ పెన్షన్ పోర్టల్ లాగిన్‌లో జీవిత భాగస్వామి పెన్షన్ ప్రాసెస్ చేయవచ్చన్నారు. అర్హులైన దరఖాస్తుదారులు పించను మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులను ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి అర్హత ప్రకారం మంజూరు చేస్తారన్నారు. ఈ విధంగా దరఖాస్తు చేసుకున్న జీవిత భాగస్వాములకు ప్రతి నెలా 15వ తేదీలోపు పెన్షన్ మంజూరు చేయబడుతుందన్నారు. ప్రతినెలా భార్యాభర్తల పింఛను మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ పెన్షన్ల మంజూరుకు పేర్కొన్న నియమ నిబంధనలకు కట్టుబడి ఈ ప్రక్రియను డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ పర్యవేక్షిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

# పక్కా గృహాల నిర్మాణం వేగవంతానికి కృషి

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

ప్రజాశక్తి కథనానికి స్పందన

గృహ నిర్మాణ సంస్థ ద్వారా పక్కా గృహాల నిర్మాణం వేగవంతానికి కృషి చేస్తామని జిల్లా ప్రధాన హౌసింగ్ అధికారి పి.శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. ఈ నెల 21వ తేదిన 'సొంతింటి కల సాకారమయ్యేనా' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. దానికి స్పందించిన జిల్లా ప్రధాన హౌసింగ్ అధికారి పి.శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ గృహ నిర్మాణ సంస్థ ద్వారా పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా అందవలసిన సహకారాన్ని లబ్ధిదారులందరికీ అందేలా చూస్తామన్నారు. వారికి ప్రభుత్వం ద్వారా అందవలసిన సిమెంట్, ఇనుము, ఇసుకను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎవరైనా ఆర్థిక కారణాలతో నిర్మాణాలను మధ్యలో ఆపి ఉన్నారో వారికి సంబంధిత ఏపిఎంలతో మాట్లాడి ఎస్‌జిహెచ్ రుణాలు ఇప్పిస్తామన్నారు. అంతేకాకుండా 90 డేస్ అమౌంట్ పెండింగ్ ఉన్న వారికి ఏపివోలతో మాట్లాడి సంబంధిత జాబితాలను అందజేసి వారికి త్వరితగతిన లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మౌలిక వసతులు లేని కారణంగా ఎక్కడైనా గృహ నిర్మాణ పనులు ఆగిపోయినట్లయితే వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

---

# వెట్టిచాకిరీపై దృష్టి సారించండి

**- బాధ్యులపై చట్టపరమైన చర్యలు**
**- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం**

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

బాల కార్మికులు లేకుండా చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా వెట్టిచాకిరీ (బాండెడ్ లేబర్)పై దృష్టి సారించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. వెట్టి చాకిరీ నుండి విడిపించడంతో పాటు బాధితులకు అవసరమైన పునరావాసం, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి బాండెడ్ లేబర్ విజిలెన్స్ కమిటీ సమావేశం ప్రకాశం భవనంలో శుక్రవారం జరిగింది. 2014 తరువాత రాష్ట్రంలో తొలిసారిగా ప్రకాశం జిల్లాలోనే ఈ కమిటీ నియామకం జరిగింది. తొలిసారి జరిగిన ఈ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహరహిత, బాల కార్మిక రహిత ప్రకాశం జిల్లా ఆవిష్కరణ కోసం 'బంగారు బాల్యం' కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించామన్నారు. శ్రమదోపిడీ, లైంగిక దోపిడీతో పాటు ఆర్థిక దోపిడీ కూడా ఈ వెట్టిచాకిరీలో ఉంటుందన్నారు. కేవలం పెద్దలు మాత్రమే కాకుండా పిల్లలతోనూ వెట్టిచాకిరీ చేయిస్తున్న వారిపై పోలీసు కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వెట్టిచాకిరీ నిర్మూలనా చట్టం-1976 లోని నిబంధనలను కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 2047 నాటికి పేదరికం లేని ప్రకాశం జిల్లా ఆవిష్కృతమయ్యేలా తమ శాఖల పరిధిలోనూ, సమిష్టిగానూ స్వచ్ఛంద సంస్థల సహకారంతో అధికారులు కషి చేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ గాయత్రిదేవి, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, డిఈఓ కిరణ్ కుమార్, డిఎస్‌ఓ ఎస్. పద్మశ్రీ, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, ఇన్‌చార్జి డిఎం,హెచ్‌ఓ డాక్టర్ పద్మజ, డిఆర్‌డిఏ పీడీ టి.వసుంధర, డిసిపిఓ దినేష్ కుమార్ సిడబ్ల్యుసి సభ్యురాలు నీలిమ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆర్. సునీల్ కుమార్ (సార్డ్), ప్రియాంక, శ్యామ్ (ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్), ఇతర అధికారులు పాల్గొన్నారు.

---

ఉద్యోగ భద్రత కల్పించాలని

# సిఐటియు ఆధ్వర్యంలో వాలంటీర్ల ధర్నా

**ప్రజాశక్తి-బాపట్ల**

గ్రామ, వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ బాపట్ల సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో పాత బస్టాండ్ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్.మజుందార్ మాట్లాడుతూ గ్రామ, వార్డు వాలంటీర్స్ ఉపాధిని కాపాడాలన్నారు. రూ.పది వేలు వేతన హామీ నెరవేర్చి వాలంటీర్లు పని విధివిధానాలు ప్రకటించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విజయవాడలో వరదలు వచ్చిన సమయంలో వాలంటీర్ సేవలు ఉపయోగించుకున్నారని గుర్తుచేశారు. కరోనా కాలంలో మరియు వద్ధులకు వితంతు పెన్షన్లు



ధర్నా చేస్తున్న వాలంటీర్లు

అందించే సమయంలో వాలంటీర్ల సేవలను ప్రజలు పెద్ద ఎత్తున హర్షించారన్నారు. నేడు వారిని తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ సలీమాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోటేశ్వరి ,అనూష, ఎస్కే షాకీరా, ఎం.లక్ష్మి, ఎం జ్యోతి, కే అరుణ, సిఐటియు జిల్లా నాయకులు కే శరత్ పాల్గొన్నారు.

---

# ఎస్టీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## కలెక్టర్ వెంకట మురళి

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

ఎస్టీల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి స్పష్టం చేశారు. ఎస్టీల ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ శుక్రవారం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పిజిఆర్ఎస్ కు విశేష స్పందన లభించింది. మా సమస్యల పరిష్కరించండి.. అంటూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎస్టీలు వినతి పత్రాల ద్వారా కలెక్టర్ ను వేడుకున్నారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపారు. మరి కొన్నిటికి పరిశీలన నిమిత్తం ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు. ఇంటి స్థలం లేని ప్రతి ఎస్టీ కుటుంబానికి నివాస భూమి కేటాయించడానికి అధికారులు సర్వే ప్రక్రియ ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వం పంపిణీ చేసిన భూమిలో సాగు చేసుకుంటున్న గిరిజనుల వివరాలను ఆన్ లైన్ లో పొందుపరచాలన్నారు. భూమికి పట్టాలు లేని వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి గ్లోరియా, జిల్లా అధికారులు, వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**కిశోర బాలికల వికాసానికి కృషి**

కిశోర బాలికల విద్య, ఎదుగుదల, ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. కిశోర వికాసం కార్యక్రమంపై జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. కిశోర బాలికల్లో రక్తహీనత పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ చెప్పారు. 11 నుంచి 18 సంవత్సరాల లోపు బాలికలను కిశోరి వికాసం పరిధిలోకి తీసుకురావాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 64.8 శాతం రక్తహీనత ఉన్నట్లు సర్వేలున్నాయన్నారు. ఆ మేరకు కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. . ముఖ్యంగా బాల్యవివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. ఇబ్బందులలో ఉన్న బాలికలను గుర్తించి వారికి ధైర్యం చెప్పాలని సూచించారు. బాలల హక్కులు పరిరక్షణకై అనేక చట్టాలు ఉన్నాయన్నారు. 1098 చైల్డ్ లైన్ అమల్లో ఉన్న విషయాలపై బాలలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమా కమిటీలోని జిల్లా అధికారులు పాల్గొన్నారు.